పౌర్ణమి పోటుకు తీరం కోత



వైఎంసీఏ ఎదురుగా కోతకు గురైన తీరం

విశాఖపట్నం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా ఆదివారం రాత్రి సముద్రం పోటెత్తడంతో వైఎంసీఏ ఎదురుగా ఉన్న తీరం కోతకు గురైంది. కొన్నేళ్ల క్రితం బీచ్‌కు వచ్చేవారికి నీడను ఇచ్చేందుకు అక్కడ 'కోకోనట్ ఎరీనా' (కొబ్బరిచెట్ల సముదాయం) ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి ఉవ్వెత్తున ఎగిసిపడిన అలల ఉధృతికి కోకోనట్ ఎరీనా వరకూ తీరం కోసుకుపోయింది. రక్షణ కోసం ప్రత్యేకంగా నిర్మించిన ఐరన్ బండ్స్ కూడా బయటకు వచ్చేయడం గమనార్హం. సముద్రం కోతకు గురికాకుండా విశాఖపట్నం పోర్టు క్రమం తప్పకుండా కోట్లాది రూపాయలు వెచ్చించి డ్రెడ్జింగ్ పనులు నిర్వహిస్తోంది. పోర్టు ... మిగతా 6వ పేజీలో

» డ్రెడ్జింగ్ చేసినా ప్రయోజనం శూన్యం!



తీరం కోత

అమర వీరులకు నివాళులు



ఇండియా-పాకిస్తాన్ మధ్య 1971లో జరిగిన యుద్ధంలో వీరోచిత పోరాటం చేసి అమరులైన భారత్ సైనికులకు నేవీ, జిల్లా అధికారులు సోమవారం నివాళులు అర్పించారు. ఆ యుద్ధంలో సాధించిన విజయానికి గుర్తుగా ఏటా డిసెంబరు 16న విజయ దివస్ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అమరుల సేవలను గుర్తుచేసుకుంటారు. ఆర్‌కే బీచ్‌లో 'విక్టరీ ఎట్ సీ' వద్ద అమరవీరుల స్థూపం ముందు పుష్పగుచ్ఛాలు ఉంచి తూర్పు నౌకాదళం అధికారులు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్ నివాళులు అర్పించారు.

అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న తూర్పు నావికాదళం వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా

వైసీపీ నేతల అక్రమాలపై మహా ఉదాసీనత

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినా చర్యలకు జీవీఎంసీ అధికారుల మీనమేషాలు

» నోటీసులు ఇవ్వడంతోనే సరి

» వైసీపీ హయాంలో టీడీపీ నేతల ఆస్తులే లక్ష్యంగా దాడులు

» సబ్బం హరి నివాసం మొదలు పల్లా శ్రీనివాస్ భవనం వరకూ కూల్చివేసినవి కోకొల్లలు

» చిన్నపాటి ఉల్లంఘన ఉన్నా తీవ్రస్థాయిలో చర్యలు

» వైసీపీ నేతలు అసలు ప్లాన్ లేకుండా భవనాలు నిర్మించినా ఇప్పుడు చర్యలు శూన్యం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అక్రమ భవన నిర్మాణాల విషయంలో జీవీఎంసీ అధికారులు అనుసరిస్తున్న ఉదాసీన వైఖరిపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ నేతల ఆస్తులు లక్ష్యంగా చర్యలకు దిగిన అధికారులు...ఇప్పుడు కళ్లెదుటే అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా, వాటిపై ఆధారాలతో ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నా ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. నాడు టీడీపీ నేతల ఇళ్లు, కార్యాలయాలు, సంస్థలపైకి తెల్లవారుజామున యంత్రాలు, వందలాది మంది సిబ్బందితో వెళ్లి కూల్చివేతలకు పాల్పడ్డ అధికారులు...ప్రస్తుతం కూటమి ప్రభుత్వ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ నేతలు నిర్మాణాలు చేపట్టినా వాటికి నష్టం వాటిల్లకుండా పరోక్ష సహాయ సహకారాలు అందిస్తుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పాత గాజువాకలో జాతీయ రహదారి పక్కన తన సొంత స్థలంలో ఐదేళ్ల కిందట షాపింగ్ కాంపెక్స్ నిర్మాణం ప్రారంభించారు. రోడ్డు వైపు 15 అడుగులు సెట్‌బ్యాక్ వదిలి ప్లాన్ ప్రకారం నిర్మాణం చేపట్టారు. అయితే పల్లా శ్రీనివాసరావు టీడీపీని వీడి తమ పార్టీలో చేరలేదనే ఉక్రోశంతో వైసీపీ పెద్దలు...ఆ షాపింగ్ కాంప్లెక్స్‌పై గురిపెట్టారు. జాతీయ రహదారిని భవిష్యత్తులో 280 అడుగులకు విస్తరించాల్సి ఉంటుంది కాబట్టి, సెట్ బ్యాక్ సరిపడనంత వదలలేదంటూ జీవీఎంసీ అధికారులను ఉసిగొల్పి భవనాన్ని అర్ధరాత్రి వేళ యంత్రాలతో కూల్చివేయించారు. దీనిపై పల్లా శ్రీనివాసరావు కోర్టును ఆశ్రయించారు. అలాగే మాజీ మేయర్ సబ్బం హరి సీతమ్మధారలో ఎప్పుడో నిర్మించుకున్న ఇంటి ప్రహరీ గోడ కొద్దిగా పార్కు స్థలంలో ఉందంటూ తెల్లవారుజామున జీవీఎంసీ ఉన్నతాధికారులు యంత్రాలతో వెళ్లి కూలగొట్టించారు. అదేవిధంగా టీడీపీకి చెందిన ఎం.శ్రీభరత్‌కు చెందిన గీతం కాలేజీ ప్రహరీ ప్రభుత్వ భూమిలో ఉందంటూ కూల్చేశారు. అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్‌కు చెందిన సీతంపేటలోని షాపింగ్ కాంప్లెక్స్‌కు సెట్ బ్యాక్‌లు వదలలేదంటూ పూర్తిగా ధ్వంసం చేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే వైసీపీ హయాంలో టీడీపీ నేతల ఆస్తులను లక్ష్యంగా చేసుకుని కూల్చివేతలకు పాల్పడిన ఉదంతాలు అనేకం ఉన్నాయి.



వైసీపీ నేత చింతలపూడి నిర్మించిన అపార్టుమెంట్‌లో పార్కింగ్‌కు వాడాల్సిన సెల్లార్‌లో హోటల్ నిర్వహణ



నిబంధనలకు విరుద్ధంగా మాజీ మంత్రి అమర్‌నాథ్ నిర్మించిన భవనం



మధురవాడలో టీడీఆర్ బాండ్ జారీచేసిన జీవీఎంసీ స్వాధీనం చేసుకోని వైసీపీ నేతకు చెందిన భవనం



వేరొక పట్టా నంబరులో గల స్థలంలో మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ నిర్మిస్తున్న అపార్టుమెంట్

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అధికారుల ఉదాసీనత

వైసీపీ ప్రభుత్వంలో చురుగ్గా వ్యవహరించడంతోపాటు ఉల్లంఘన జరిగితే కూల్చివేతే అన్నట్టు వ్యవహరించిన టౌన్‌ప్లానింగ్ అధికారులు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మారిపోయారు. ఎంత భారీ ఉల్లంఘనలు జరిగినా చర్యలకు మీనమేషాలు లెక్కిస్తున్నారు. వైసీపీ నేతలకు సంబంధించిన ఆస్తులు, వారి ప్రమేయం కలిగిన నిర్మాణాలు అయితే వాటిపై చర్యలు తీసుకోవడం అటుంచితే కాపాడేందుకు తమవంతు సహకారాన్ని పరోక్షంగా అందిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరైనా పక్కా ఆధారాలతో ఫిర్యాదు చేస్తే మాత్రం మొక్కుబడిగా నోటీసులు ఇచ్చి తమ పని అయిపోయిందనట్టు చేతులు దులిపేసుకుంటున్నారు.

ఉదాహరణకు పాతగాజువాక జంక్షన్‌లో వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఒక షాపింగ్‌మాల్‌ను నిర్మించారు. ఆ భవనానికి జీవీఎంసీ ఎలాంటి ప్లాన్ జారీచేయకపోగా, స్థలంపై కూడా వివాదం నడుస్తోందనే ప్రచారం ఉంది. పైగా జాతీయ రహదారికి కనీసం ఐదు అడుగులు సెట్‌బ్యాక్ కూడా విడిచిపెట్టకుండా నిర్మాణం పూర్తిచేశారు. పల్లా శ్రీనివాసరావు నిర్మించిన షాపింగ్‌కాంప్లెక్స్‌కు 15 అడుగులు సెట్‌బ్యాక్ వదిలినప్పటికీ ఇంకా సరిపోదంటూ ఆ భవనాన్ని కూల్చేసిన అధికారులకు, గుడివాడ అమర్‌నాథ్ నిర్మించిన ... మిగతా 6వ పేజీలో



సబ్బం హరి ఇంటి ప్రహరీ గోడ పార్కు స్థలంలో నిర్మించారంటూ కొట్టేసిన సిబ్బంది



గీతం ప్రహరీ గోడ కూల్చివేత (ఫైల్)

ఆర్ట్స్ కోర్సుల్లో పెరిగిన ప్రవేశాలు

» ఏయూలో గడిచిన రెండు, మూడేళ్లతో పోల్చితే 300 మంది అధికంగా చేరిక

» ప్రస్తుతం 20 విభాగాల పరిధిలో 23 కోర్సులు

» ఫిలాసఫీ, ఎంబీఏ, పొలిటికల్ సైన్స్, ఇంగ్లీష్ వంటి కోర్సుల్లో భారీగా విదేశీ విద్యార్థులు...



విశాఖపట్నం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల పరిధిలో నిర్వహిస్తున్న పలు కోర్సుల్లో ప్రవేశాలు పెరుగుతున్నాయి. గడిచిన రెండు, మూడేళ్లతో పోలిస్తే ఈ ఏడాది సుమారు 250 అడ్మిషన్లు పెరిగినట్టు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహరావు తెలిపారు. ఆర్ట్స్ కళాశాల పరిధిలో ప్రస్తుతం 20 విభాగాలు ఉన్నాయి. వాటిలో 23 కోర్సులను నిర్వహిస్తున్నారు. ఇందులో సంస్కృతం మినహా అన్ని కోర్సుల్లోనూ దాదాపు 70 నుంచి 100 శాతం మేర సీట్లు భర్తీ అయ్యాయి. రెండేళ్ల కిందట ఇవే కోర్సుల్లో 700 నుంచి 750 మంది చేరగా, ఈ ఏడాది వెయ్యి దాటారు. ఫిలాసఫీ, ఎంబీఏ, పొలిటికల్ సైన్స్, ఇంగ్లీష్ వంటి కోర్సుల్లో విదేశీ విద్యార్థులు భారీగా చేరుతున్నారు. ఆయా కోర్సుల్లో ఈ ఏడాది సుమారు వంద మంది వరకూ ఇతర దేశాలకు చెందిన విద్యార్థులు చేరారు. ఇక ఎంకామ్, ఎంబీఏ, ఇంగ్లీష్, సోషల్‌వర్క్, పాలిటిక్స్, తెలుగు, జర్నలిజం, హిస్టరీ, సోషియాలజీ వంటి కోర్సుల్లో 100 శాతం సీట్లు భర్తీకావడం గమనార్హం. గతంలో ఈ కోర్సుల్లో 50 శాతం సీట్లు కూడా భర్తీ కాని పరిస్థితి ఉండేది. ప్రథమ, ద్వితీయ సంవత్సరాలు కలిపి ప్రస్తుతం ఆర్ట్స్ కాలేజీ పరిధిలో రెండు వేల మంది విద్యార్థులు ఉన్నారు. మొత్తం 160 మంది అధ్యాపకులు ఉన్నారు. శాశ్వత ఫ్యాకల్టీ ఆశించిన స్థాయిలో లేకపోవడంతో కాంట్రాక్టు, గెస్ట్ ఫ్యాకల్టీ సహాయంతో ... మిగతా 6వ పేజీలో

పోలీసుల కళ్లు గప్పి పరారీ!

» రెండు రోజుల క్రితం ఘటన

ఆరిలోవ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం చోరీ కేసులో పోలీసులు అదుపులోకి తీసుకున్న ఓ బాలుడు వారి కళ్లుగప్పి పరారయ్యాడు. రెండు రోజుల కిందట జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. అయితే పోలీసులు మాత్రం గోప్యత పాటిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు...హనుమంతవాక జంక్షన్‌లో రెండు రోజుల కిందట ద్విచక్ర వాహనం చోరీ కేసులో ఓ బాలుడిని ఆరిలోవ పోలీసులు అదుపులోకి తీసుకుని, స్టేషన్‌కు తరలించారు. అతను పాత నేరస్థుడు. కాగా సాయంత్రం ఆరు గంటల సమయంలో వాష్‌రూమ్‌కని చెప్పి వెళ్లిన అతడు అక్కడ వెంటిలేటర్లకు అద్దాలు లేకపోవడంతో అందులో నుంచి దూరి పరారయ్యాడు. దీనిపై సీఐ మల్లేశ్వరరావును ప్రశ్నించగా, అలాంటిదేమీ జరగలేదన్నారు.

భూ సమస్యలు పరిష్కారమయ్యేనా?

వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన భూముల రీసర్వేలో అనేక తప్పులు

» సరిదిద్దకపోతే భవిష్యత్తులో మరిన్ని చిక్కులు

» అస్మదీయుల భూములు 22-ఏ జాబితా నుంచి మినహాయించారని ఆరోపణలు

» డిపట్టాభూములను ముందు చేజిక్కించుకుని ఫ్రీహోల్డ్ అనుమతులు పొందిన వైసీపీ పెద్దలు

» పేదల ఇళ్ల కోసం చేపట్టిన భూ సమీకరణలోనూ అవకతవకలు

» దసపల్లా భూములపై ఏకపక్షంగా నిర్ణయం

» ఇళ్ల పట్టాలకు కన్వేయన్స్ డీడ్స్ కోసం నిరుపేదల నిరీక్షణ

» నేడు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ సమీక్ష

విశాఖపట్నం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): **జిల్లాలో రెవెన్యూ సంబంధిత అంశాలపై ఆ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మంగళవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆయన సోమవారం నగరానికి చేరుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో 22-ఏ జాబితా నుంచి అడ్డగోలుగా భూముల సర్వే నంబర్లు తొలగించారు. అలాగే డి.పట్టా భూములదారులతో ముందస్తుగా ఒప్పందం చేసుకుని ఫ్రీహోల్డ్ అనుమతులు మంజూరు చేశారు. అదేవిధంగా పేదల ఇళ్ల కోసం నగర శివార్లలో చేపట్టిన భూ సమీకరణ, దసపల్లా భూములు ప్రైవేటు వ్యక్తులకు అప్పగింత, తదితర వాటిపై అనేక ఆరోపణలు/అభ్యంతరాలు ఉన్నాయి. వీటిపై మంత్రి ఎటువంటి నిర్ణయం తీసుకుంటారోననే ఆసక్తి అన్ని వర్గాల్లోనూ ఉంది.**



రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న అధికారులు

వైసీపీ పాలనలో విశాఖలో అనేక భూదందాలు జరిగాయి. అస్మదీయుల భూములను 22-ఎ నుంచి తప్పించారు. మధురవాడ, పీఎం పాలెం ప్రాంతాల్లో మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమరయోధుల భూములకు ఎన్‌వోసీలు జారీ చేయించి వాటిని 22-ఎ నుంచి తొలగించినట్టు అప్పటి విపక్షం, ప్రస్తుత పాలకపక్ష నేతలు అనేకమార్లు ఫిర్యాదు ... మిగతా 6వ పేజీలో

ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లతో నేడు రెవెన్యూ మంత్రి సమీక్ష

విశాఖపట్నం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఆర్డీవోలతో రెవెన్యూమంత్రి అనగాని సత్యప్రసాద్ మంగళవారం విశాఖ కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించనున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన వినతుల పరిష్కారం, ప్రస్తుతం జరుగుతున్న రెవెన్యూ సదస్సులు, నిషేధిత జాబితా 22-ఎ నుంచి భూముల తొలగింపు, పలు ప్రాజెక్టులకు కేటాయించిన భూముల ఎలియనేషన్, అసైన్‌మెంట్ భూ వివాదాలు, భూముల రీసర్వే, ఫ్రీహోల్డ్ అనుమతులు, భూసేకరణ, భూసమీకరణ, చిన్నపాటి ఆక్రమణల క్రమబద్ధీకరణ, ప్రభుత్వం నిర్ణయాల మేరకు అమలు చేయాల్సిన ప్రాజెక్టుల తాజా స్థితి తదితర 12 అంశాలపై మంత్రి సమీక్షిస్తారు. మంగళవారం ఉదయం తొలుత కలెక్టరేట్‌లో ప్రజల నుంచి మంత్రి వినతులు స్వీకరిస్తారు. ప్రజా ప్రతినిధులతో సమావేశమవుతారు. కాగా సోమవారం నగరానికి ... మిగతా 6వ పేజీలో

చిన్నారులకు ఆరోగ్య కార్డులు

» అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థుల వరకూ అందరికీ హెల్త్ స్క్రీనింగ్

» రెండు దశల్లో పరీక్షలు నిర్వహించేలా ప్రభుత్వం నుంచి ఆదేశాలు

» సమస్య ఉన్నట్టయితే వెంటనే వైద్యం

» పరీక్షల అనంతరం ఆరోగ్య సమాచారంతో కూడిన కార్డులు అందించేందుకు చర్యలు

» చిన్నారి ఎత్తు, బరువుతోపాటు ఇతర ఆరోగ్య సమాచారంతో కూడిన వివరాలు నమోదు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో పద్దెనిమిదేళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ కేన్సర్ స్క్రీనింగ్ చేయిస్తోన్న ప్రభుత్వం.. తాజాగా చిన్నారుల ఆరోగ్యంపైనా దృష్టిసారించింది. ఇందులో భాగంగానే అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు మొదలు పదో తరగతి పిల్లల వరకూ అందరికీ వైద్య పరీక్షలు చేయిస్తోంది. ఈ పరీక్షలు రెండు దశల్లో నిర్వహించాల్సిందిగా ఆరోగ్య శాఖకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి.

మొదటి దశలో ఏఎన్‌ఎం, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌ఎహెచ్‌పీ)లు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు వెళ్లి స్క్రీనింగ్ చేస్తారు. ఈ స్క్రీనింగ్‌లో ఏవైనా సమస్యలు ఉన్నట్టు గుర్తిస్తే రెండో దశ స్క్రీనింగ్ కోసం దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళతారు. అక్కడ వైద్యులు మరోసారి పూర్తిస్థాయిలో పరీక్షించి అవసరమైన మందులు ఇస్తారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిలో పరిష్కరించలేని సమస్యలను ఉన్నత స్థాయి కేంద్రానికి పంపాల్సిందిగా ఆదేశాలు వచ్చాయి. అంటే, డిస్ట్రిక్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్‌కు తీసుకువెళ్లాల్సి ఉంటుంది. అందుకు అవసరమైన ... మిగతా 6వ పేజీలో



నేడు ఆనందపురం మండల సమావేశం

ఆనందపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరగనున్నట్టు ఎంపీడీవో డాక్టర్ జానకి తెలిపారు. సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

నేడు రెవెన్యూ సదస్సు

ఎండాడ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ ముబారక్ కాలనీలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ఎం. పాల్ కిరణ్ తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ముబారక్ కాలనీ పార్కులో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సదస్సు జరుగుతుందన్నారు. స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన

కొమ్మాది, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా మారికవలస ఏపీటీడబ్ల్యూఆర్ పాఠశాల విద్యార్థులకు ఆ శాఖాధికారులు సోమవారం విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించారు. అనంతరం పెయింటింగ్ పోటీలు నిర్వహించి, విద్యుత్ శాఖ జోన్ 3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కొమ్మాది ఏఈ నరేశ్, పాఠశాల ప్రిన్సిపాల్ శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి శంకుస్థాపన



కొమ్మాది, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. సోమవారం ఆమె పరదేశిపాలెంలో రూ. 13 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, కాలువల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరదేశిపాలెంలో ఇప్పటికే రూ. 16 లక్షలతో రోడ్లు, కాలువలు నిర్మించామని, మిగిలిన ప్రాంతంలో కూడా దశల వారీగా పనులు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు,కొండపు రాజు, జనసేన నాయకుడు దేవర శివ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం సోమవారం నేత్రపర్వంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి నెల గంట కార్యక్రమాన్ని జరిపారు. అనంతరం ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. తరువాత పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ప్రజా స్పందనకు రెండు వినతులు

భీమునిపట్నం,డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి రెండు వినతులు అందాయి. పట్టణ ప్రణాళిక విభాగానికి ఒకటి, రెవెన్యూ విభాగానికి ఒకటి అర్జీ వచ్చినట్టు జోనల్ కమిషనర్ ప్రసన్న వాణి తెలిపారు. వాటిని ఆయా శాఖలకు పంపించి, త్వరగా పరిష్కరించాలని ఆదేశించామన్నారు.

చిట్టివలసలో అన్నసమారాధన

తగరపువలస,డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నాగవంశ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు కాళ్ల గురునాయుడు వర్ధంతి సందర్భంగా చిట్టివలసలో సోమవారం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం చైర్మన్ కాళ్ల శ్రీనివాస్, సభ్యులు పురుషోత్తం, సూర్య, మాజీ కౌన్సిలర్ చిలక నరసింగరావు, వర్తక సంఘం నాయకులు గురునాథరావు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు రెవెన్యూ మంత్రి సమీక్ష

... 5వ పేజీ తరువాయి

చేరుకున్న మంత్రికి ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, వీఎంఆర్‌డీ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, ఆర్డీవో శ్రీలేఖ, తదితరులు స్వాగతం పలికారు. సమీక్ష కోసం రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా, సీసీఎల్ఏ అదనపు చీఫ్ కమిషనర్ ఎస్. ప్రభాకరరెడ్డి నగరానికి చేరుకున్నారు.



పూర్తిగా శిథిలావస్థలో ఉన్న ఏఎంసీ కార్యాలయం



శ్లాబ్ స్థాయి వరకు జరిగిన నూతన భవన నిర్మాణం

అద్దె భవనంలో ఏఎంసీ కార్యాలయం

- అసంపూర్తిగా నూతన భవన నిర్మాణం
- వైసీపీ పాలనలో మంజూరు కాని నిధులు
- ఇబ్బందుల్లో సిబ్బంది, రైతులు

భీమునిపట్నం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం అద్దె భవనంలో కాలం వెల్లదీస్తోంది. ఈ కార్యాలయానికి ఏటా కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా.. సొంత భవనం లేదు. దీంతో అద్దె భవనంలో చాలీచాలని వసతితో సిబ్బంది, రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. 1976 నవంబరు 20న భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవిర్భవించింది. అప్పట్లో పట్టణంలోని అద్దె భవనంలో కార్యాలయాన్ని నిర్వహించేవారు. తర్వాత 1997లో ఫుట్‌బాల్ గ్రౌండ్ ఎదురుగా ఉన్న కమిటీ స్థలంలో నూతన భవనం నిర్మించారు. దీన్ని అదే ఏడాది మార్చి 2న అప్పటి రాష్ట్ర మార్కెటింగ్, వెనుకబడిన తరగతులు శాఖా మంత్రి ఎ. ఎల్లారెడ్డి ప్రారంభించారు. భవనాన్ని నాణ్యతా లోపంతో నిర్మించడం వల్ల 20 ఏళ్లకే శిథిలావస్థకు చేరుకుంది. అయినప్పటికీ భవనానికి మరమ్మతులు చేస్తూ, రంగులు వేస్తూ మరో అయిదేళ్లు కాలక్షేపం చేశారు. ఆఖరికి కార్యాలయం సిబ్బంది శిథిల భవనంలో విధులు నిర్వర్తించడానికి భయాందోళనకు గురవడంతో రెండేళ్ల క్రితం చిన్నబజారులో అద్దె భవనంలోకి మార్పు చేశారు. ఈనేపథ్యంలో 2021లో ప్రభుత్వం నూతన భవన నిర్మాణానికి రూ. 45 లక్షలు మంజూరు చేయడంతో 2022లో టెండర్లు పిలిచారు. 2022 ఏప్రిల్‌లో అప్పటి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తొలుత రూ.14లక్షల బిల్లు మంజూరు కావడంతో నూతన భవన నిర్మాణాన్ని కమిటీ కార్యాలయం ఆవరణలోనే ప్రారంభించారు. ఈ నిధులతో శ్లాబ్ వరకూ పనులు జరిగాయి. 2023లో రెండవ దఫా బిల్లు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. అప్పటి నుంచి భవనం అసంపూర్తిగా దర్శనం ఇస్తుంది. ప్రస్తుతం కార్యాలయాన్ని చిన్నబజారు నుంచి దొరతోట రోడ్‌లో ఉన్న కృష్ణా కాలనీ వద్దకు మరో అద్దె భవనంలోకి మార్పు చేశారు. చిన్నబజారులో నెలకు అద్దె కన్నా కృష్ణా కాలనీలో తక్కువ అద్దెకు భవనం లభించడంతో అక్కడికి షిఫ్టు చేశారు. ఈ కార్యాలయం భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల పరిధిలో వుంది. భీమిలి ఫుట్‌బాల్ గ్రౌండ్ వద్ద అయితే కార్యాలయం మూడు మండలాల రైతులకు అందుబాటులో వుండేదని, కృష్ణా కాలనీలో వున్న అద్దె భవనం దూరంగా ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఈ కార్యాలయానికి 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.4.26 కోట్ల ఆదాయం లభించింది. పాలకులు, అధికారులు స్పందించి నూతన భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు. కాగా ఈ విషయమై వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ లక్ష్మీ చైతన్య 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారులు దృష్టిలో ఈ సమస్య ఉందని, త్వరలోనే పరిష్కరిస్తారని చెప్పారు.



అద్దె భవనంలో నిర్వహిస్తున్న కార్యాలయం

దశల వారీగా చెత్త కుండీల తొలగింపు

- భీమిలిలో వంద కుండీల తీసివేత
- మహిళలు ఏ రోజు చెత్త ఆ రోజు క్లాప్ వాహనాల్లో వేసేలా చర్యలు
- వ్యాపార కూడళ్లల్లో కొనసాగింపు

తగరపువలస, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ భీమిలి జోనల్ పరిధిలోని నాలుగు వార్డుల్లో చెత్త కుండీల తొలగింపునకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈమేరకు నివాస ప్రాంతాల్లో ఉన్న వంద చెత్త కుండీలను ఇప్పటికే తొలగించి, వాటిలోని చెత్తను నమ్మివానిపేట డంపింగ్ యార్డుకు తరలించారు. ఇంతవరకు కూడలి ప్రాంతాల్లో ఉన్న చెత్త కుండీల్లో నివాసితులు ఇళ్లలోని చెత్త వేస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం పది గంటల్లోపు కుండీల్లోని చెత్తను క్లాప్ వాహనం ద్వారా డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. అయితే ఇంటింటికి వచ్చే చెత్త సేకరణ వాహనాలకు చెత్తను అందించే కార్యక్రమాన్ని ప్రజలకు అలవాటు చేయడానికి వీలుగా చెత్త కుండీలను తాత్కాలికంగా తొలగించాలని అధికారులు భావిస్తున్నారు. తగరపువలస, చిట్టివలస, భీమిలి ప్రాంతాల్లో ఉన్న అనేక చెత్త కుండీలను తొలగించడం ద్వారా ప్రతిరోజూ అన్ని వీధులకు చెత్త సేకరణ వాహనాలను పంపిస్తున్నామని జీవీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయుడు తెలిపారు. వాహనాల్లో తడి, పొడి చెత్తకు వేర్వేరుగా కుండీలు పెట్టామని ఆయన తెలిపారు. వాహనం వచ్చే ముందు మైక్ ద్వారా ప్రకటన కూడా చేస్తున్నామని చెప్పారు.భవిష్యత్తులో భీమిలి జోనల్ కార్యాలయం పరిధిలో ఉన్న నాలుగు వార్డుల్లో ఒక్క చెత్త కుండీ కూడా లేకుండా ప్రయత్నం చేస్తున్నామన్నారు. కాగా ఒకేసారి అన్ని కుండీలను తొలగిస్తే ఇబ్బంది వస్తుందని, వ్యాపార కూడళ్లల్లో ఉన్న వాటిని కొనసాగిస్తున్నారు. వచ్చే ఏడాది నుంచి సంపూర్ణ స్వచ్ఛసేవా కార్యక్రమాలు అమలు చేయడానికి వీలుగా అధికారులు ఈప్రయత్నం చేస్తున్నారు. సోమవారం నుంచి ప్రజలకు మైక్ ద్వారా ప్రచారం కూడా చేస్తున్నారు.

ధనుర్మాసోత్సవాలు ప్రారంభం

ఆనందపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంభీరం పంచాయతీ పైడా ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో ఉన్న శరణ్య వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి ధనుర్మాస వ్రతాలు ప్రారంభమైనట్టు ఆలయ ధర్మకర్త పైడా కృష్ణప్రసాద్ తెలిపారు. వచ్చేనెల 13వ తేదీ వరకూ ఈ వ్రతాలు జరుగుతాయన్నారు. అలాగే ప్రతిరోజూ ఉదయం 5 నుంచి 8 వరకు తిరుప్పావై పారాయణం, పొంగలి, పులిహోర, దద్దోజనం, చక్కెర పొంగలి ప్రసాదం సమర్పణ, వితరణ జరుగుతుందన్నారు. జనవరి 10న ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని ఉత్తరద్వార దర్శనం, 11న కూడార్రై ప్రసాద వితరణ, 13న గోదాదేవి కల్యాణం నిర్వహించనున్నట్టు చెప్పారు.

కొమ్మాది : అన్నంరాజునగర్‌లోని అష్టలక్ష్మీ దేవాలయంలో సోమవారం నుంచి ధనుర్మాసోత్సవాలు ప్రారంభమ య్యాయి. ఆలయ ప్రధాన అర్చకుడు చామర్తి శ్రీధరస్వామి ఆధ్వర్యంలో వేకువజామున గోదాదేవికి అలంకరణ చేసి పూజలు, అర్చనలు జరిపారు. అనంతరం తిరుప్పావై పాశురంలోని మొదటి పాశురం భక్తులు సామూహికంగా పఠనం చేశారు. ఈనెల మొత్తం ఆలయంలో వేకువజామున 5.30 గంటలకు గోదాదేవి వ్రతం నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు చెప్పారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

విశాలాక్షినగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నగరాన్ని ప్లాస్టిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని 9వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీరావు కోరారు. సోమవారం ఆయన వార్డు పరిధిలోని దుకాణాదారులకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించడంతో పాటు గుడ్డ సంచులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్లు జైలు

విజయనగరం క్రైం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో 2020లో నమోదైన పోక్సో కేసులో నిందితుడు విశాఖపట్టణం జిల్లా పద్మనాభం మండలం పొట్నూరు గ్రామానికి చెందిన అయితి అప్పలనాయుడుకు పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కె. నాగమణి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 4 వేల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. విజయనగరం జిల్లా మెంటాడ మండలానికి చెందిన బాలిక నగరంలోని ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న సమయంలో అయితి అప్పలనాయుడుకి పరిచయం ఏర్పడింది. నిందితుడు బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆటోలో వేర్వేరు ప్రాంతాలకు తీసుకువెళ్లి పలుమార్లు శారీరకంగా అనుభవించినట్టు వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ పి. వీరాంజనేయ రెడ్డి నిందితుడ్ని అరెస్టు చేసి... కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. కేసులో ప్రాసిక్యూషన్ పూర్తయ్యే విధంగా వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ పత్రాలు సమర్పించారు. నిందితుడు అప్పలనాయుడు బాలికపై అత్యాచారానికి పాల్పడినట్టు నేరం రుజువైంది. దీంతో పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.4 వేల జరిమానా విధించినట్టు తెలిపారు. త్వరితగతిన నిందితుడికి శిక్ష పడే విధంగా వ్యవహరించిన దర్యాప్తు, ప్రాసిక్యూషన్ అధికారులను ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.

పౌర్ణమి పోటుకు తీరం కోత

... 5వ పేజీ తరువాయి

శాండ్ ట్రాప్ ఏరియాలో ఇసుకను తవ్వి సబ్‌మెరైన్ మ్యూజియం పరిసరాల్లో డంప్ చేయిస్తోంది. అయినప్పటికీ అదే ప్రాంతంలో సముద్రం కోతకు గురికావడం డ్రెడ్జింగ్ పనులపై అనుమానాలను రేకెత్తిస్తోంది. ఇలా ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు కోతకు గురవుతున్న తీరాన్ని పటిష్ఠం చేయడానికి వీఎంఆర్‌డీఏ ఇటీవలె రూ.200 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపించింది. వీటికి ఆమోదం లభిస్తే త్వరలో పనులు ప్రారంభం అవుతాయి.

ఆర్ట్స్ కోర్సుల్లో పెరిగిన ప్రవేశాలు

... 5వ పేజీ తరువాయి

తరగతులు నిర్వహిస్తున్నారు. పూర్తిస్థాయి ఫ్యాకల్టీ 50 మంది ఉండగా, కాంట్రాక్టు ఫ్యాకల్టీ 25 మంది, గెస్ట్ ఫ్యాకల్టీ 105 మంది వరకూ ఉన్నారు.

ఉద్యోగాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి

- ప్రొఫెసర్ ఎ.నరసింహరావు, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్

ఆర్ట్స్ కాలేజీ పరిధిలో అడ్మిషన్లు భారీగా పెరుగుతున్నాయి. గడిచిన ఏడాది రిలీవ్ అయిన వారిలో 60 నుంచి 70 శాతం మందికి ఉపాధి అవకాశాలు కల్పించాం. ఆరేడు బ్రాంచీలకు చెందిన విద్యార్థులకైతే 90 శాతం మేర ఉద్యోగాలు వచ్చాయి. తరగతుల నిర్వహణ, విద్యార్థులకు అధ్యాపకు గైడెన్స్, ఉద్యోగ అవకాశాలు బాగుండడం వల్లే ఎక్కువ మంది విద్యార్థులు చేరుతున్నారు. డిమాండ్ ఉన్న కోర్సుల్లో రానున్న రోజుల్లో సీట్ల సంఖ్యను పెంచే ప్రతిపాదనలు ఉన్నాయి.

ఐపీఎల్ తరహాలో జీపీఎల్ మ్యాచ్‌లు

ఆనందపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మ్యాచ్‌ల తరహాలో మండలంలోని గిడిజాల గ్రామంలో గిడిజాల ప్రీమియర్ లీగ్ (జీపీఎల్) మ్యాచ్‌ల నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయి.పంచాయతీలోని సీనియర్ ఆటగాళ్ల ఆధ్వర్యంలో నిర్వహించనున్న జీపీఎల్ లీగ్‌లో అయిదు జట్లు పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. షిణగం అప్పలరాజు, షిణగం శంకర్, షిణగం మురళి, షిణగం రవి జట్లు స్పాన్సర్ చేయగా 110 మంది క్రీడాకారులకు ఆదివారం రాత్రి వేలం నిర్వహించారు. అత్యధికంగా 12 వేల రూపాయలకు ఒక ప్లేయర్‌ను దక్కించుకోగా తక్కువగా రూ. 500 ఒకరిని కొనుగోలు చేశారు. ఒక్కొక్క స్పాన్సర్ రూ. 40 వేల పెట్టుబడితో అయిదు జట్లు రెండు లక్షల రూపాయలతో ప్లేయర్స్‌ను కొనుగోలు చేశారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా జనవరి 8 నుంచి ఈ మ్యాచ్‌లు నిర్వహించి, కనుమ రోజున బహుమతులు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. ప్రథమ బహుమతి కింద రూ. 50 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 40 వేలు, తృతీయ బహుమతిగా రూ. 30 వేలు అందజేయనున్నట్టు చెప్పారు. ఒక్క గిడిజాల పంచాయతీ యువకులు మాత్రమే ఈ మ్యాచ్‌లో పాల్గొనున్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు పరిశీలన

మధురవాడ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని వాంబేకాలనీలో జరిగిన టీడీపీ సభ్యత్వ నమోదును ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు రవితేజ సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన స్థానికంగా ఉన్న అన్నక్యాంటీన్‌ను సందర్శించి, మధ్యాహ్న భోజనం చేశారు. అక్కడి నుంచి సునీల్‌శర్మ కాలనీలోని జడ్పీ పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతి శివాజీ, పోతిన నాయుడు, పిళ్లా రాము, నొడగల భవానీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపునకు నిరసన

తగరపువలస, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ నాయకులు తగరపువలస కూడలిలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు చార్జీల పెంపునకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన ప్రతులను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి సీటూ తగరపువలస అధ్యక్షుడు ఎస్. అప్పలనాయుడు, ఆటో కార్మికులు, ముఠా కార్మికులు పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలోని వేములవలస జంక్షన్‌లో పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ భీమిలి జోన్ నాయకులు ఎస్. అప్పలనాయుడు, కె. నాగరాణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ప్రజలపై విద్యుత్ భారం ఎక్కువైందన్నారు. నిత్యావసరాల ధరలు అదుపు లేకుండా పెరుగుతున్నాయని, దీనికితోడు ట్రూ అప్ పేరుతో విద్యుత్ చార్జీలు పెంచి సామాన్యులను కోలుకోలేని దెబ్బ తీస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ముఠా కార్మికులు శివ శంకర్, బంగారునాయుడు, అప్పన్న పాల్గొన్నారు.

చిన్నారులకు ఆరోగ్య కార్డులు

... 5వ పేజీ తరువాయి

ఖర్చులను కూడా ప్రభుత్వమే భరిస్తుంది. ఈ బాధ్యత కూడా స్థానిక ఆరోగ్య శాఖ సిబ్బంది చూసుకోవాలి. జిల్లాలో డిస్ట్రిక్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ కేజీహెచ్‌లో ఉంది. అవసరమైన వారికి అక్కడే సర్జరీలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటారు. గ్రహణం మొర్రి, పుట్టుకతో వినికిడి సమస్య, మాట్లాడలేకపోవడం వంటి ఇబ్బందులను గుర్తిస్తే వారికి అక్కడే వైద్య సేవలు అందిస్తారు. జిల్లాలో పేరెంట్ టీచర్, మీటింగ్ జరిగిన రోజు నుంచి ఈ పరీక్షలు ప్రారంభమయ్యాయి.

ఆరోగ్య సమాచారంతో కార్డులు

పరీక్షలు నిర్వహించిన అనంతరం విద్యార్థి ఆరోగ్య సమాచారంతో కూడిన కార్డులను అందించనున్నారు. ఇందులో చిన్నారి ఎత్తు, బరువుతోపాటు మరో ఏడు రకాల వివరాలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. అలాగే, చిన్నారికి సంబంధించి ఏమైనా ఇబ్బందులు ఉంటే అందులో పొందుపరుస్తారు. ఆరు నెలలకు ఒకసారి ఈ ఆరోగ్య పరీక్షలను నిర్వహించనున్నారు. పరీక్షలు నిర్వహించిన ప్రతిసారి కొత్త కార్డులు అందించనున్నారు. రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ స్క్రీనింగ్ ప్రోగ్రామ్‌లో ప్రధానంగా నాలుగు 'డీ'లపై దృష్టిసారించామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. వ్యాధులు (డిసీజెస్), శరీర అభివృద్ధిలో ఆలస్యం (డెవలప్‌మెంట్ డిలేస్), వైకల్యం (డిసార్మిటీస్), డెఫిషియన్సీ (లోపాలు)ను గుర్తించేలా స్క్రీనింగ్ ప్రక్రియ సాగుతోందన్నారు. చిన్నారుల్లో కొన్ని రకాల అనారోగ్య సమస్యలు, లోపాలు ఉన్నప్పటికీ వాటిని తల్లిదండ్రులు ఆలస్యంగా గుర్తిస్తారని, దీనివల్ల మెరుగైన వైద్య సేవలు అందించడం సాధ్యం కాదన్నారు. ముఖ్యంగా మాట్లాడలేకపోవడం, వినికిడి వంటి ఇబ్బందులను చిన్న వయసులోనే గుర్తించకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నా యన్నారు. ఇటువంటి సమస్యలను గుర్తించి మెరుగైన చికిత్స అందించేందుకు ఈ స్క్రీనింగ్ ప్రోగ్రామ్ దోహదపడుతుందన్నారు.



నీటి సంఘాల సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

నీటి సంఘాల సభ్యులకు ఎమ్మెల్యే అభినందనలు

పద్మనాభం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి సంఘాలకు ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో విజయం సాధించిన సభ్యులను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం నగరంలోని తన నివాసంలో అభినందించారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో 16 సాగునీటి సంఘాలకు ఈనెల 14న జరిగిన ఎన్నికల్లో నూతన కమిటీ ప్రతినిధులు ఎన్నికయ్యారు. వారందరికీ అభినందనలు చెప్పిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చెరువుల అభివృద్ధికి ఆయా సంఘాల ప్రతినిధులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, టీడీపీ పద్మనాభం, భీమిలి మండలాల అధ్యక్షులు కె. రమణ, డీఏఎన్ రాజు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు,టీడీపీ నాయకులు నగేశ్ కుమార్, సత్యనారాయణ, బీఆర్‌బీ నాయుడు, గణేశ్, అప్పారావు, శ్రీనివాస్, జనసేన నాయకుడు రామస్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతల అక్రమాలపై 'మహా' ఉదాసీనత

... 5వ పేజీ తరువాయి

భవనంలో ఉల్లంఘనలు కనిపించకపోవడం ఆశ్చర్యకరం. దీనిపై పత్రికల్లో కథనాలు ప్రచురితమైనా ఇంతవరకూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

జీవీఎంసీ జోన్-6 పరిధి వడ్లపూడిలో వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య భారీ అపార్టుమెంట్ నిర్మాణం చేపట్టారు. పార్కింగ్‌కు వాడాల్సిన సెల్లార్‌లో హాటల్ ఏర్పాటుచేయడంతోపాటు భవనంపై అదనపు అంతస్థు వేసి పెంట్‌హౌస్ నిర్మించేసుకున్నారు. దీనిపై అపార్టుమెంట్‌లోని ఫ్లాట్ల యజమానులు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా కనీసం నోటీసులు కూడా జారీచేయలేదు.

జీవీఎంసీ జోన్-2 మధురవాడ సర్వే నంబర్ 2లోని పట్టా నంబర్ 595లో అపార్టుమెంట్ నిర్మాణానికి ప్లాన్ కోసం జీవీఎంసీకి వైసీపీ నేత, మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ దరఖాస్తు చేసుకున్నారు. పట్టానంబర్ 595లో కాకుండా పట్టా నంబర్ 585లోని స్థలంలో యథేచ్ఛగా అపార్టుమెంట్ ప్రారంభించేశారు. దీనిపై మహేష్ అనే వ్యక్తి ఆధారాలతో అధికారులకు ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకోలేదు సరికదా...భవన నిర్మాణం శరవేగంగా పూర్తిచేసేందుకు తమ సహాయ సహకారాలను పరోక్షంగా అందించారనే ఆరోపణలు ఉన్నాయి. చివరకు హైకోర్టు ఆదేశిస్తే గానీ జీవీఎంసీ అధికారులు విచారణ జరపడానికి కదల్లేదు. జీవీఎంసీ అధికారుల విచారణలో ఎంవీవీపై ఆరోపణలు వాస్తవమేనని నిర్ధారణ అయినప్పటికీ పనులు నిలుపుదల చేయాలని ఆదేశించకపోవడం వైసీపీ నేతల పట్ల ఇప్పటికీ జీవీఎంసీ అధికారులకు ప్రేమాభిమానాలు తగ్గలేదనే విమర్శలకు బలాన్ని చేకూర్చుతోంది.

జీవీఎంసీ జోన్-2 పరిధిలో మధురవాడ నుంచి బక్కన్నపాలెం నవోదయ పాఠశాల రోడ్డు విస్తరణకు గతంలో నగర పాలక సంస్థ స్థల సేకరణ చేపట్టింది. రోడ్డు విస్తరణకు అవసరమైన ప్రైవేటు స్థలాలను తీసుకునేందుకు స్థల యజమానులకు టీడీఆర్‌లు జారీచేసింది. అందులో భాగంగానే మధురవాడ జాతీయరహదారికి ఆనుకుని ఉన్న ఒక వైసీపీ చోటా నేత షాపింగ్ కాంప్లెక్స్‌లో కొంత స్థలం రోడ్డు విస్తరణలో పోతుండడంతో టీడీఆర్ జారీచేశారు. భవన యజమాని టీడీఆర్‌లు తీసుకోవడంతో, జీవీఎంసీ అధికారులు మార్కింగ్ చేసిన మేర భవనాన్ని తొలగించి స్థలాన్ని రోడ్డు విస్తరణకు అప్పగించాలి. కానీ టీడీఆర్ తీసుకున్న వైసీపీ నేత షాపింగ్ కాంప్లెక్స్‌లో రోడ్డు విస్తరణకు అవసరమైన స్థలం ఇవ్వకపోగా, అదే భవనంపై అదనపు అంతస్థు నిర్మాణం ప్రారంభించారు. దీనిపై పత్రికల్లో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. అయినప్పటికీ టౌన్‌ప్లానింగ్ అధికారులు మాత్రం ఆ భవనంలో రోడ్డు విస్తరణకు అవసరమైన స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించలేదు. వీటిపై టౌన్‌ప్లానింగ్‌లోని ఒక అధికారి వద్ద ప్రస్తావించగా, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడానికి తాము సిద్ధపడినా కూటమిలోని కొందరు నేతలే స్వయంగా అడ్డుపడుతున్నారని చెప్పుకొచ్చారు. గుడివాడ అమర్‌నాథ్ భవనంపై చర్యలు తీసుకోవడానికి వెళితే కూటమిలోని ముఖ్య నేత ఒకరు స్వయంగా తమ ఉన్నతాధికారికి ఫోన్ చేసి భవనం కూల్చివేత వంటి తీవ్ర చర్యలు తీసుకోవద్దని ఆదేశించారన్నారు.

భూ సమస్యలు పరిష్కారమయ్యేనా?

... 5వ పేజీ తరువాయి

చేశారు. పెందుర్తి, ఆనందపురం ప్రాంతాల్లో చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి. పేదల ఇళ్ల కోసం శివారు ప్రాంతాల్లో చేపట్టిన ఐదు వేల ఎకరాల సమీకరణ పారదర్శకంగా జరగలేదనే వాదన ఉంది.

రీసర్వేలో తప్పులే తప్పులు

గత ప్రభుత్వ హయాంలో జిల్లాలోని 51 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే నిర్వహించారు. భూముల సరిహద్దులు, రికార్డుల్లో పేర్లు, సర్వే నంబర్లలో తప్పులపై 3,195 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో 330 ఫిర్యాదులు పరిష్కరించినట్టు కలెక్టర్ల సదస్సులో ఇచ్చిన నివేదిక వెల్లడిస్తోంది. అయితే రీసర్వేపై రైతుల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. దిగువస్థాయి రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్ల తీరు, అవగాహన లేమి, గ్రామస్థాయిలో ఒత్తిళ్ల మేర తప్పులు/అవకతవకలు జరిగాయని రైతులు ఆరోపిస్తున్నారు. రెండు నెలల క్రితం రీసర్వేపై నిర్వహించిన గ్రామ సభలపైనా పెదవివిరుస్తున్నారు. భూముల సరిహద్దులు, రికార్డుల్లో పేర్లు, సర్వేనంబర్ల తప్పులు సరిదిద్దకపోతే భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు రావచ్చునని అంటున్నారు.

ఫ్రీహోల్డ్ అనుమతులపై ఆరోపణలు

జిల్లాలో 626 ఎకరాల డీపట్టా భూములకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు జారీచేశారు. గత ప్రభుత్వంలో కీలక స్థానంలో పనిచేసిన ఓ అధికారి, ఆయన బినామీలు నగర శివార్లలోని డి.పట్టాలు కలిగిన రైతులతో భూముల కొనుగోళ్లకు ముందే ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఆనందపురం మండలం గండిగుండంలో డీపట్టా భూములు చేతులు మారిన తరువాతే అప్పటి పాలకుల ఆదేశాల మేరకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు జారీచేశారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో 626 ఎకరాలకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు జారీ కాగా 138.96 ఎకరాలు రిజిస్ట్రేషన్ అయిపోయింది. ఆ సమయంలో ఆరోపణలు వెల్లువెత్తడంతో మిగిలిన భూముల రిజిస్ట్రేషన్ నిలిపివేశారు. ఈలోగా ప్రభుత్వం మారడంతో డీపట్టా భూములకు ఫ్రీహోల్డ్ జారీ నిలిపివేస్తూ ఆదేశాలు వచ్చాయి.

22-ఎ సమస్య పరిష్కారమయ్యేనా..

జిల్లాలో పలు భూములను నిషేధిత జాబితా 22-ఎలో చేర్చారు. వాటిలో జిరాయితీ, ప్రభుత్వం వద్ద కొనుగోలు చేసిన భూములు ఉన్నాయి. ఆయా భూముల యజమానులు ఏళ్ల తరబడి కలెక్టరేట్ చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. వివాదం లేని భూములను 22-ఎ నుంచి తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని జిల్లా యంత్రాంగం అనేక పర్యాయాలు లేఖలు రాయడంతో గత పాలకుల హయాంలో ఆంక్షలు సడలించారు. అయితే తొలగింపు ప్రక్రియ సావ్యంగా సాగలేదు. గత ప్రభుత్వం 22-ఎ నుంచి తొలగించిన భూముల్లో అత్యధికం పోర్టు, మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమరయోధులకు చెందినవి ఉన్నాయి. మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమరయోధులకు చెందిన భూములు 22-ఎ నుంచి తొలగించడంలో వైసీపీ పెద్దల హస్తం ఉందనే ఆరోపణలు ఉన్నాయి. కాగా, టైటిల్ విషయంలో క్లియర్‌గా ఉన్న భూములను 22-ఎ నుంచి తొలగించాలన్నదే బాధితుల విన్నపం.

దసపల్లా భూములపై గట్టిగా ఉంటారా?

వేల కోట్ల రూపాయల విలువైన దసపల్లా భూముల విషయంలో గత పాలకులు తాము అనుకున్నవిధంగా చేశారు. కోర్టు ఆదేశాలను చూపి 22-ఎ నుంచి తొలగించారు. ఇంకా అక్కడ భవన నిర్మాణాలకు వైసీపీ నేత కుమార్తెకు చెందిన నిర్మాణ కంపెనీతో స్థల యజమానులతో బలవంతపు ఒప్పందాలు చేశారు. దీనిపై అప్పట్లో టీడీపీ నేతలంతా స్పందించారు. ప్రభుత్వం వచ్చిన వెంటనే దసపల్లా భూములు స్వాధీనం చేసుకుంటామని, డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ రద్దు చేస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తాజాగా జిల్లా యంత్రాంగం నుంచి దసపల్లా భూములపై నివేదిక తెప్పించుకుంది.

ఇళ్ల స్థలాలకు కన్వేయన్స్ డీడ్స్ కోసం ఎదురుచూపు

టీడీపీ ప్రభుత్వ హయాం (2014-19)లో నగరంలో సుమారు 70 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరుచేశారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకున్న వారికి 296, 388 జీవోల ప్రకారం సీఎం హోదాలో 2016లో చంద్రబాబునాయుడు పట్టాలు పంపిణీ చేశారు. వారికి 2018లో కన్వేయన్స్ డీడ్స్ ఇవ్వాల్సి ఉండగా, ప్రభుత్వం మారడంతో కార్యరూపం దాల్చలేదు. కన్వేయన్స్ డీడ్స్ ఇస్తే ఇంటి స్థలంపై యజమానికి సర్వహక్కులు కలుగుతాయి. డీడ్స్ వచ్చిన వెంటనే స్థలాలు రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. అందుకోసం వారంతా ఆశగా ఎదురు చూస్తున్నారు.


టీఐసీ పాయింట్ వద్ద నిలిచిన వాహనాలు

ఆరిలోవలో ట్రాఫిక్ సమస్య

ఆరిలోవ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 12, 13 వార్డులలో సోమవారం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులకు పెద్ద సంఖ్యలో దరఖాస్తుదారులు రావడంతో ఆరిలోవ టీఐసీ పాయింట్ వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తింది. కొంతమంది తమ వాహనాలను రోడ్డు పక్కన నిలిపి రెవెన్యూ సదస్సులు జరిగిన చోటకు వెళ్లిపోవడంతో బాటసారులు తప్పించుకుని వెళ్లే మార్గం లేకపోయింది. ఈ కారణంగా రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. సుమారు 400 మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు వచ్చి రాకపోకలను క్రమబద్ధీకరించేవరకు సుమారు అరగంట పాటు రద్దీ నెలకొంది.

రచయితల వ్యాసాలకు ఆహ్వానం

ఆరిలోవ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సాంఘిక ఉద్యమకారుడు, ఆంధ్రా పెరియార్, భారత నాస్తిక సమాజం. శాస్త్రీయ విద్యా సమాఖ్య వ్యవస్థాపకుడు డాక్టర్ జయ గోపాల్ ప్రథమ వర్ధంతి సందర్భంగా వ్యాసాలను ఆహ్వానిస్తున్నట్లు భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ సభ్యుడు జె. రవి తెలిపారు. 2025 ఫిబ్రవరి 9న విశాఖలో ప్రథమ వర్ధంతి సభ జరుగుతుందన్నారు. జయగోపాల్ ఉద్యమ చరిత్ర ఈ పుస్తకంలో పొందుపరుస్తామని తెలిపారు. భావ సారూప్యంతో ఉద్యమ అనుబంధం ఉన్న మిత్రులు వ్యాసరూపంలో ఫొటోలతో ఈనెల 31లోగా వాట్సాప్ నెంబరు (98660 78486)కు పంపాలని సూచించారు. వ్యాస రచయిత ఫొటో జతచేయాలని కోరారు.

ఎలక్ట్రిక్ వాహనాలతో యువతకు ఉపాధి

సిరిపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎలక్ట్రిక్ వాహనాలకు చేయూతనందిస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇండస్ట్రీస్ డైరెక్టర్ అభిషేక్ కిశోర్ తెలిపారు. నగరానికి వచ్చిన ఆయన్ను ధరతి బ్రో ఎలక్ట్రికల్ స్కూటర్ సంస్థ చైర్మన్ డాక్టర్ డి. జైభరత్ కలిసి తమ ప్రాజెక్టు వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా అభిషేక్ కిశోర్ మాట్లాడుతూ ఎలక్ట్రికల్ వాహనాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు.విశాఖ నుంచి మొదటిసారిగా రూపొందించిన ఈకో ఫ్రెండ్లీ వాహనమైన బ్రో స్కూటర్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌తో పాటు అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు వల్ల అనేక మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

'కూటమి అండతోనే రేషన్ బియ్యం అక్రమ రవాణా'

మద్దిలపాలెం,డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కూటమి నేతల అండతోనే విశాఖ పోర్టు మీదుగా రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతుందని వైసీపీ చోడవరం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆరోపించారు. సోమవారం ఆయన మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మంత్రి నాదెండ్ల మనోహర్ పోర్టులోని వీసీటీపీఎల్‌లో తనిఖీ చేసి పక్కనున్న రెండు వేర్‌హౌజ్‌లను ఎందుకు వదిలేశారని ప్రశ్నించారు. అధికార పార్టీ ముఖ్య నేత బంధువుడిగా చెబుతున్న ఆ వేర్‌హౌజ్‌ల వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. కాకినాడ పోర్టుకి వెళ్లిన నాదెండ్ల టీడీపీ మంత్రికి చెందిన షిప్‌ను తనిఖీ చేయకుండా వదిలేశారని ఆరోపించారు. విశాఖ నుంచే అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నట్టు నిరూపించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

సినిమా గైడ్

● **పుష్ప-2 :** జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీకన్య, సంగం, శరత్, మెలోడి, శరత్, కిన్నెర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ, నరసింహ, సుకన్య, సౌజన్య, మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని, లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), శ్రీరాములమ్మ, గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 48, టమాటా 17, వంకాయలు (తెలుపు)26, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 36, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 30, బీరకాయలు 44, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 22, క్యారెట్ 54 దొండకాయలు 36, బంగాళ దుంపలు 32, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 120, అల్లం (పాతది)56, బరబాటి 34, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 24 దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 300, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 56, పొటల్స్ 48, కీరదోస 28, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 34, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30,కర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	620
విజయనగరం	624
శ్రీకాకుళం	624

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	103
ఫారం ధర	123
విత్ స్కిన్	216
స్కిన్‌లెస్	226

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే రామకృష్ణబాబు హెచ్చరిక


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఆరిలోవ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూములు, ఖాళీ స్థలాలు, శ్మశానవాటికలను ఆక్రమిస్తే స్వాధీనం చేసుకోవడమే గాక, వారిపై చర్యలు తీసుకుంటామని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు హెచ్చరించారు. ముందుముందు ప్రభుత్వానికి స్థలాలు, భూముల అవసరం ఉందని, ఎక్కడ, ఎవరు ఆక్రమణలకు పాల్పడినా సహించేది లేదని స్పష్టం చేశారు. సోమవారం ఆరిలోవ హిందీ కాలేజి రోడ్డులో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఆర్డీవో సంగీత్ మాధుర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములు, స్థలాలపై ప్రజల హక్కులను గత ప్రభుత్వం కాలరాసిందని, ఇళ్ల పట్టాలు సైతం ఇవ్వకుండా ఇబ్బంది పెట్టిందని రామకృష్ణబాబు ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న ఇలాంటి రెవెన్యూ సమస్యలు తెలుసుకుని శాశ్వత పరిష్కారం చూపడానికి ముఖ్యమంత్రి ఈ సదస్సులు ఏర్పాటు చేశారన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలకు రెండేళ్ల పాటు పూర్తి హక్కులు ఉంటాయని పేర్కొన్నా, వైసీపీ ప్రభుత్వం శాశ్వత పట్టాలు ఇవ్వకుండా నీరుగార్చిందని ఆరోపించారు. గతంలో 100 గజాలు ఉన్నవారికి ఉచితంగా, అంతకంటే ఎక్కువ ఉన్న వారికి అతితక్కువ ధర నిర్ణయించి పట్టాలు ఇచ్చామన్నారు. ఎన్నికల నిబంధనలు రావడంతో కొందరికి ఇవ్వలేదన్నారు. వైసీపీ ప్రభుత్వం వారికి ఎలాంటి హక్కులు కల్పించలేదన్నారు. కోర్టు తీర్పు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. ఈ ప్రభుత్వం అందరికీ పట్టాలు ఇస్తుందన్నారు. సింహాచలం దేవస్థానం భూముల సమస్యకు త్వరలో శాశ్వత పరిష్కారం లభిస్తుందని హర్షధ్వానాల మధ్య పేర్కొన్నారు. సింహాచలం దేవస్థానం స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్నవారికి పట్టాలిస్తామన్నారు. సమస్యలపై అందజేస్తున్న దరఖాస్తులపై అర్జీదారుల సెల్ నెంబరు, ఆధార్ నెంబరు రాయాలని సూచించారు. సదస్సుకు 1,100 వినతులు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పాల్ కిరణ్, జడ్సీ ఫణిరాం, కార్పొరేటర్ సునీత పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల కోసం ఆర్‌డీఓకి వినతి

ఆరిలోవ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలోని 13వ వార్డు రామకృష్ణాపురం గ్రామస్తులకు శాశ్వత ఇళ్ల పట్టాలు, ప్రస్తుతం ఉంటున్న నివాస స్థలంలో స్లాబు వేసుకునేందుకు అనుమతులు కోరుతూ ఆర్డీవో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆరిలోవ హిందీ కళాశాల వద్ద సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో అభ్యుదయ సేవా సంఘం గ్రామ కమిటీ ఆర్డీవోను కలిసి ఇక్కడ సుమారు 600 కుటుంబాలు ఉన్నాయని పేర్కొన్నారు. గతంలో బీఆర్‌టీఎస్ నిమిత్తం 230 మంది ఇళ్లను తొలగించి వారికి 50 గజాల వంతున కొత్త గోశాల ఎదుట ఇళ్ల స్థలాలు ఇచ్చారని గుర్తుచేశారు. ఎస్ఎస్‌నగర్‌గా పిలుచుకునే ఈ కొత్త ప్రాంతంలో ఇళ్లకు స్లాబులు వేసుకున్నారని, ఇదే సర్వే నెంబరులో రైల్వే జోన్ భవనాల నిమిత్తం 52 ఎకరాలు కేటాయించారని తెలిపారు. తమకే ఎందుకు అభ్యంతరం చెబుతున్నారని ప్రశ్నించారు. దీనిపై విచారణ జరిపించి న్యాయం చేస్తామని ఆర్డీవో హామీ ఇచ్చినట్లు కమిటీ అధ్యక్షుడు బాబూరావు, గౌరవ అధ్యక్షుడు కాకార గోవింద్, కార్యదర్శి ఆర్‌జీ నాయుడు తెలిపారు. మొత్తం 400 దరఖాస్తులు ఇచ్చారు. అందరూ ఇంటి పన్నులు చెల్లించారని, కరెంట్ మీటర్లు కూడా ఉన్నాయని పేర్కొన్నారు.

బీజేపీ సభ్యత్వాల్లో విశాఖకు మొదటి స్థానం : రవీంద్ర

పెదవాల్తేరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ విశాఖ జిల్లా అధ్వర్యంలో రెండు లక్షలకు పైగా సభ్యత్వాలు నమోదు చేసినట్లు ఆ పార్టీ విశాఖ పార్లమెంటరీ స్థానం జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర పేర్కొన్నారు. సోమవారం నగర బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో నాయకులు, కార్యకర్తలు కృషి చేసి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపినందుకు కృతజ్ఞతలు తెలిపారు.ఇదే స్ఫూర్తితో పోలింగ్ బూత్ కమిటీల నిర్మాణం కూడా ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని నాయకులు, కార్యకర్తలు, మండల అధ్యక్షులను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వి శాఖ జిల్లా ఇంచార్జి పుట్ట గంగయ్య, పార్వతీపురం జిల్లా ఇంచార్జి ఎస్‌వీఎస్ ప్రకాష్ రెడ్డి, శ్రీకా కుళం జిల్లా ఇంచార్జి ఎన్ విజయేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేక కౌంటర్లు

జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి. సంపత్‌కుమార్


ప్రత్యేక కౌంటర్ వద్ద వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

వెంకోజీపాలెం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను పక్కాగా నిర్వహిస్తామని కమిషనర్ డాక్టర్ పి. సంపత్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మాట్లాడారు. పీజీఆర్ఎస్‌ను ఒక గోల్డెన్ డే గా పరిగణనలోకి తీసుకోవాలని కలెక్టర్ల సమావేశంలో సీఎం తెలిపారన్నారు. ఆ దిశగా అధికారులు ప్రజా సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలన్నారు. అలాగే దివ్యాంగులు, వృద్ధులకు కార్యాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, వేదిక మధ్యలో దివ్యాంగులు, వృద్ధులు వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని వెను వెంటనే పరిష్కరించేలా చూస్తున్నామన్నారు. అలాగే ఫిర్యాదుదారులు కూర్చునేందుకు కుర్చీలు, తాగునీరు, టీ వంటి సదుపాయాలు కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. ఇకపై వినతుల స్వీకరణకు ప్రతి సోమవారమే కాకుండా ప్రతిరోజూ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా అర్జీలు స్వీకరిస్తామని తెలిపారు. అలాగే ప్రతిరోజూ సాయంత్రం 5 నుంచి 6 వరకు తాను ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తానని చెప్పారు.


టీడీపీ 15వ వార్డు అధ్యక్షుడికి పువ్వు అందిస్తున్న సచివాలయ సిబ్బంది

పుష్పాలతో సచివాలయ సిబ్బంది నిరసన

వెంకోజీపాలెం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన జీవీఎంసీ కౌన్సెల్ సమావేశంలో కార్పొరేటర్ కాకి గోవింద సచివాలయ సిబ్బందిపై చేసిన వ్యాఖ్యలకు గాను సచివాలయ కార్యదర్శులు వినూత్నంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం వారు జీవీఎంసీ కార్యాలయం ఎదుట గాంధీ విగ్రహం వద్ద వార్డుల్లోని నాయకులకు పుష్పాలు అందజేసి శాంతియుతంగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకుల వద్ద తమ ఆవేదన తెలిపారు.

పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చేయాలి : సీపీఎం



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

వెంకోజీపాలెం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం హెచ్‌బీ కాలనీ బస్‌స్టాప్ వద్ద సీపీఎం 15, 16 వార్డుల నాయకుల ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా కరెంట్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అదానీతో చేసుకున్న ఒప్పందం వల్ల రాష్ట్ర ప్రజలపై కరెంట్ చార్జీలు భారీగా పెరుగుతున్నాయన్నారు. రెండేళ్ల క్రితం వాడిన కరెంట్‌కు ఇప్పుడు ట్రూ అప్, ఇంధనపు, ఎప్‌పీపీపీఏ పేరుతో 18 వేల కోట్ల రూపాయలు భారం వేసిందన్నారు. అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాల వల్ల మాజీ సీఎం జగన్ రూ.1750 కోట్లు ముడుపులు తీసుకున్నారని ఆధారాలు ఉన్నా.. కూటమి ప్రభుత్వం ఆ ఒప్పందాలను రద్దు చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి కృష్ణారావు, ఎం.ప్రదీప్,జీవీఎన్ చలపతి, జీఎస్ రాజేశ్వరరావు, జీవీ రమణ, కె. కుమారి, షరీఫ్, బేగం, తదితరులు పాల్గొన్నారు.

'అవినాశ్ బీజేపీ నేత కాదు'

పెదవాల్తేరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : హనీ ట్రాప్ కేసులో బీజేపీ నాయకుడు కంచం అవినాశ్ కూడా ఉన్నాడని ప్రచారం జరుగుతోందని, ఆయన తమ పార్టీ కాదని బీజేపీ విశాఖ పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర స్పష్టం చేశారు. సోమవారం ఆయన బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అవినాష్ బీజేపీ పెద్దల సమక్షంలో చేరి ఉండవచ్చేమో కానీ, అతనికి పార్టీలో ఇంత వరకు ఎటువంటి బాధ్యత లేదన్నారు. అతను చేసిన చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు తగిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ శాఖను కోరారు.


ఎంబీసీ అధికారులను సత్కరిస్తున్న రిజిస్ట్రార్ ధనుంజయరావు

ఏయూను సందర్శించిన అమెరికన్ ప్రతినిధులు

వెంకోజీపాలెం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ అధికారులు ఏయూను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుతో సమావేశమయ్యారు. ఏయూలో అమెరికన్ కార్నర్ సాధిస్తున్న ప్రగతి, నిర్వహించిన కార్యక్రమాలను వారు వివరించగా అమెరికన్ కార్నర్‌లో నిర్వహించే విభిన్న కార్యక్రమాలకు అవసరమైన సంపూర్ణ సహకారం తాము అందిస్తామని రిజిస్ట్రార్ తెలిపారు. అనంతరం వారు ఏయూలోని అమెరికన్ కార్నర్‌ను సందర్శించి, వసతులు, కార్యక్రమాల నిర్వహణను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ కార్యాలయం అమెరికన్ కార్నర్స్ ప్రోగ్రామింగ్ కోఆర్డినేటర్ మెలిసా నందుల, అమెరికన్ కాన్సులేట్ చీఫ్ సెక్యూరిటీ అధికారి కాలే నందుల, ఏయూ అమెరికన్ కార్నర్ సమన్వయకర్త ఆచార్య పాల్ డగ్లస్, తదతరులు పాల్గొన్నారు. అలాగే యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా (డేవిస్) స్టెమ్ సెల్ బయాలజిస్టు మాలిక్యులర్ అండ్ బయోలాజిక్స్ పరిశోధనలో ప్రఖ్యాత పరిశోధకుడు, మాలిక్యులర్ మ్యాట్రిక్స్ సీఈవో ప్రొఫెసర్ చార్లెస్ కూడా ఏయూను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రిజిస్ట్రార్ ధనుంజయ్‌రావుతో భేటీ అయ్యారు. ఏయూతో కలిసి పని చేయడానికి ఆసక్తి వ్యక్తం చేశారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

మద్దిలపాలెం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చినవాల్తేరు తమిళవీధికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ నెల 11న కారులో వెళ్లిపోయిన వ్యక్తి తిరిగి రాకపోయేసరికి సోమవారం అతని భార్య త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమిళవీధికి చెందిన కేత నవీన్‌రెడ్డి(33) వ్యాపారం చేస్తూ నష్టపోయి అప్పులపాలయ్యాడు. అతని భార్య దివ్యభారతి బంధువులను ఆరాతీసి ఎక్కడకీ వెళ్లలేదని తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు హెచ్‌సీ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

చేనేత కార్మికులను ప్రోత్సహించాలి

పెదవాల్తేరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులను ప్రోత్సహించాలని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ కోరారు. పోలమాంబ అమ్మవారి ఆలయం పక్కన ఉన్న ఏయూ మైదానంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన శ్రీసాయి చేనేత కాటన్ అండ్ సిల్క్స్ ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను సందర్శించి, కళా రూపాలను తిలకించారు. హస్త కళాకారులను అభినందించారు.

19 నుంచి దివ్యాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరాలు

విశాఖపట్నం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, వయోవృద్ధులకు సహాయ ఉపకరణాల గుర్తింపు శిబిరాలను ఈనెల 19 నుంచి 21 వరకు నిర్వహించనున్నట్టు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. 19న రెడ్డిపల్లి ఉన్నత పాఠశాల, 20న దక్షిణ నియోజకవర్గం నీలమ్మ వేపచెట్టు వద్ద, 21న పశ్చిమ నియోజకవర్గ పరిధి క్వీన్ మేరీ హైస్కూల్‌లో శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. వీల్ చైర్, చంకకర్రలు, కాలిబర్స్, స్మార్ట్‌కేన్/చేతి కర్ర, బ్రెయిలీ కిట్, స్మార్ట్‌ఫోన్స్, శ్రవణ యంత్రాలు అందించేందుకు ఎంపికలుంటాయన్నారు.

వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై ఈఓ సమీక్ష


సమావేశంలో పాల్గొన్న అధికారులు

సింహాచలం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై వచ్చేనెల 10న జరిగే వైకుంఠ ఏకాదశి ఉత్సవాన్ని అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో విజయవంతం చేయాలని ఈఓ వేంద్ర త్రినాథరావు సూచించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తర ద్వార దర్శనానికి సుమారు 40 వేల మంది భక్తులు వచ్చే అవ కాశం ఉందని, అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఉచిత, రూ.100, రూ.300 క్యూలైన్లు ఏర్పాటు చేసి, భక్తులకు అవసరమైన తాగునీరు, పారిశుధ్య నిర్వహణ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. అలాగే రవాణా సదుపాయంపై, శాంతి భద్రతల నిర్వహణ, వాహనాల నియంత్రణకు తగిన ప్రణాళికలు తయారు చేయాలని పోలీసు శాఖను కోరారు. వైద్య శిబిరాలు, అంబులెన్స్‌ను సిద్ధంగా ఉంచాలని వైద్యారోగ్య శాఖ అధికారులకు తెలిపారు. ఉత్సవం సందర్భంగా మద్యం దుకాణాలను మూసివేయాలని ఎక్సైజ్ శాఖ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, బి. రాంబాబు, ఆలయ స్థానాచార్యులు డా. టిపి రాజగోపాల్, గోపాలపట్నం శాంతిభద్రతల విభాగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి. అప్పారావు, ఎస్‌ఐ డి. అప్పలనాయుడు, సీహెచ్ రామారావు, ఆర్‌టీసీ విభాగం నుంచి సత్యనారాయణ, సింహాచలం ఆసుపత్రి వైద్యాధికారి రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రామానుజన్ టాలెంట్ టెస్టులో లిఖిత ప్రతిభ


లిఖిత, యశ్వంత్

ఎం.వి.పి.కాలనీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రామానుజన్ మేథ్స్ అకాడెమీ ఇటీవల నిర్వహించిన రామానుజన్ టాలెంట్ టెస్ట్ స్టేజ్-2 పరీక్షలో ఆరో తరగతి విద్యార్థిని జె లిఖిత రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిందని ఎంవీపీ కాలనీలోని బాష్యం హైస్కూలు ఒక ప్రకటనలో తెలిపింది.అలాగే తొమ్మిదో తరగతి చదువుతున్న కె.యశ్వంత్ జిల్లాస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించినట్లు పేర్కొంది. వీరికి డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జరిగిన కార్యక్రమంలో షీల్డు, ప్రశంసాపత్రాలు, నగదు బహుమతి అందించినట్లు పేర్కొంది. భాష్యం విద్యా సంస్థల చైర్మన్ రామకృష్ణ, సీఈవో సత్యం, జెడ్ ఈవో ఆంజనేయులు, హెచ్ఎం శిల్ప ప్రతిభావంతులను అభినందించారు.

పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితమే ఆంధ్ర రాష్ట్రం


బహుమతులు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ విజయబాబు, తదితరులు

మద్దిలపాలెం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాముల ప్రాణ త్యాగఫలమే ఆంధ్ర రాష్ట్రమని వివిఎస్ కృష్ణప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు చెప్పారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి పురస్కరించుకుని సోమవారం కళాశాలలో వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం నిరహారదీక్ష చేసి ప్రాణాలు అర్పించిన గొప్ప మహనీయుడు పొట్టి శ్రీరాములన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పోలా ఉమామహేశ్వరరావు, జీవీ ప్రతాప్, బి.లక్ష్మి, ఎస్వీ రామారావు, రవిబాబు, గోపాల్‌నాయుడు, ఎం. బాలకృష్ణ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు వినతి



ఎమ్మెల్యే వెలగపూడికి వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఎం.వి.పి.కాలనీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):ఆటో డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ నాయకులు తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును సోమవారం కలసి వినతిపత్రం ఇచ్చారు. ప్రస్తుతం ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య భారీ జరిమానాలు కాగా వాటి జీవో నెంబర్లు 21, 31 రద్దు చేయాలని, డీజిల్, పెట్రోల్, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ రుసుములు తగ్గించాలని, నగరంలో ఆటోలకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న పోలీసు, ఆర్టీవో చలానాలు రద్దు చేయాలని, డ్రైవర్లకు వాహన మిత్ర వెంటనే అమలు చేయాలని, నగరంలో ఓలా, ఉబర్, రాపిడ్ వాహనాలకు ఇచ్చిన అనుమతులను నిలిపివేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఆటో యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.మధురెడ్డి, నాయకులు రవి, మురళి, అప్పారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహా సన్నిధాన పూజ


పూజ కోసం ఏర్పాటు చేసిన మండపం

భీమునిపట్నం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బీచ్ రోడ్డులో ఉన్న అయ్యప్ప దేవాలయంలో మహా సన్నిధాన పూజ సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకమైన మండపం ఏర్పాటు చేసి, స్వామివారిని అలంకరించారు. వీరాంజనేయ అయ్యప్ప స్వామి సేవా పీఠం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాల ప్రకటనపై సీపీఐ హర్షం

పద్మనాభం రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వనున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన ప్రకటనపై సీపీఐ నాయ కులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు సోమవారం ఒక ప్రకటన విడు దల చేశారు. ఇటీవల జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు 2029 నాటికి నిరుపేదలందరికీ ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారన్నారు. సీపీఐ పోరాటం వల్లే ప్రభుత్వం స్పందించిందన్నారు.

నేడు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

పద్మనాభం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అన్న అంశంపై పంచాయతీ కార్యదర్శులకు, ప్రజాప్రతినిధులకు మంగళవారం శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంపీడీఓ విజయకుమార్ తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శిక్షణకు మండల స్థాయి అధికారులు, సర్పంచులు అన్ని గ్రేడ్‌ల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు హాజరుకావాలని కోరారు.

ముగిసిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ పోటీలు



విజేతలతో గీతం వర్సిటీ అధికారులు

సాగర్‌నగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గీతం వర్సిటీ వేదికగా కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ - 2024 పోటీలు సోమవారంతో ముగిసాయి. దేశంలోని 14 రాష్ట్రాల నుంచి 290 యువకులు ఈ పోటీలకు హాజరు కాగా 17 అంశాలపై జట్లు బ్లాక్ చైన్, సైబర్ సెక్యూరిటీ, విపత్తుల నిర్వహణ, స్మార్ట్ ఎడ్యుకేషన్, రెన్యూవబుల్ ఇంజనీరింగ్ అంశాలపై నూతన పరిష్కారాలు, ఆలోచనలను రూపొందించడానికి పోటీ పడ్డారు. పోటీల్లో తమిళనాడుకు చెందిన వివిధ ఇంజనీరింగ్ కళాశాలల జట్లు ప్రతిభ చూపి నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు అందుకున్నాయి. స్మార్ట్ ఎడ్యుకేషన్ అన్న అంశంపై సరికొత్త టెక్నాలజీని రూపొందించిన తమిళనాడుకు చెందిన బన్నారి అమ్మన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, కర్ణాటకకు చెందిన బీఎన్ ఎం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విజేతలుగా నిలిచాయి. విపత్తుల నిర్వహణపై నూతన ఆవిష్కరణకు గాను కొయంబత్తూర్‌కు చెందిన హిందుస్తాన్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, చత్తీస్‌గఢ్‌కు చెందిన భిలాయ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విజేతలుగా నిలిచాయి. కార్యక్రమంలో ఏఐసీటీఈ డైరెక్టర్ రోహిల్, ఇన్నోవేషన్ విభాగం సహాయ డైరెక్టర్ డాక్టర్ ఎలగోవన్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు అర్జీల సమర్పణ

జ్ఞానాపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురం జోనల్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 4 ఫిర్యాదులు అందాయి. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి 2, రెవెన్యూ ప్రజారోగ్యానికి ఒక్కొక్క వినతిని స్వీకరించినట్లు జోనల్ కమిషనర్ బి.రాము తెలిపారు. సూర్యాబాగ్ జోన్-4 కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజారోగ్యం, రెవెన్యూ విభాగాలకు ఒక్కొక్క అర్జీ వచ్చాయి. వాటిని పరిష్కారం నిమిత్తం జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు సంబంధిత అధికారులకు అందజేశారు. ఈ రెండు కార్యక్రమాల్లో పలువురు అధికారులు పాల్గొన్నారు.

'చర్యలు తీసుకుంటాం'

సీతమ్మధార, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధారలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. అందిన దరఖాస్తులను తహసీల్దార్ రమేష్ పరిశీలించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు.

ధనుర్మాసోత్సవాలు ప్రారంభం



స్వాములకు హారతి ఇస్తున్న అర్చకులు

అక్కయ్యపాలెం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం ధనుర్మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. తెల్లవారు జాము నుంచే భక్తులు స్వామివారికి పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలు వచ్చే నెల 13 వరకూ కొనసాగుతాయని ప్రధాన అర్చకుడు పీసపాటి మురళీ కృష్ణమాచార్యులు తెలిపారు. వచ్చే నెల 10న ముక్కోటి ఏకాదశి, 13న గోదా రంగనాథస్వామి కల్యాణం జరుగుతుందన్నారు.

శివుడికి ప్రత్యేక అభిషేకాలు

మాధవధార, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసంలో పవిత్ర ఆరుద్ర నక్షత్రంతో ఉన్న సోమవారం శైవక్షేత్రాలు భక్తులతో రద్దీగా కనిపించాయి. ఆలయాల్లో పరమశివునికి ఉదయం నుంచి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేశారు. మాధవధార పుణ్యక్షేత్రం కొండమీది భ్రమరాంబిక మల్లిఖార్జున స్వామి ఆలయంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. నిత్య అభిషేకాలు, పంచామృతాభిషేకాల అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. మురళీనగర్ శ్రీగౌరీ రామలింగేశ్వరాలయంలో స్వామికి ప్రత్యేక పూజాభిషేకాలు నిర్వహించారు. ఉదయం, సాయంత్రం స్వామి దర్శనానికి పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో విచ్చేశారు. ఆలయ కమిటీల సభ్యులు ఏర్పాట్లు చేశారు.

కేవీలో ఉచిత వైద్య శిబిరం



బాలికను పరీక్షిస్తున్న వైద్యుడు

అక్కయ్యపాలెం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయం వాల్తేరులో 62వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులకు డాక్టర్ సాల్మన్ రాజు వైద్య పరీక్షలు చేసి సలహాలు, సూచనలు ఇచ్చారు. శీతాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మంచి ఆహారపు అలవాట్లను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కమల్ జిత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాకీర్ హుస్సేన్ మరణం బాధాకరం

డాబాగార్డెన్స్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భారతీయ శాస్త్రీయ కళల్ని ప్రపంచానికి పరిచయం చేసిన ప్రముఖ సంగీత విద్వాంసుడు జాకీర్ హుస్సేన్ మరణం బాధాకరమని విశాఖ సకల కళాకారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి చెన్నా తిరుమల ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు దశాబ్దాలుగా సంగీత విద్వాంసుడిగా ప్రపంచ ఖ్యాతిని సొంతం చేసుకున్న మహోన్నత వ్యక్తి జాకీర్ హుస్సేన్ అని కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యులకు సంక్షేమ సంఘం తరఫున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామన్నారు.

నరవ ప్రకాశరావుకు యూత్ హాస్టల్స్ సన్మానం



డాబాగార్డెన్స్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భీమవరం యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా 35 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వార్షిక సమావేశాన్ని సోమవారం భీమవరం త్యాగరాజభవన్ హాల్‌లో నిర్వహించారు. రాష్ట్ర శాఖకు వ్యవస్థాపక కార్యదర్శిగా వ్యవహరించి సంస్థ అభివృద్ధికి కృషి చేసిన నగరానికి చెందిన నరవ ప్రకాశరావును సన్మానించారు. ప్రకాశరావు సేవలను జాతీయ చైర్మన్ మనోజ్ జహరి కొనియాడారు. సమాజాభివృద్ధికి నిరంతరం పాటుపడటమే తన లక్ష్యమని ప్రకాశరావు అన్నారు.

పారిశుధ్య లోపంతో దోమల బెడద

కుమ్మరివీధిలో లోపభూయిష్టంగా పారిశుధ్యం నిర్వహణ
తూతూమంత్రంగా ఫాగింగ్ .. పర్యవేక్షణ శూన్యం

జగదాంబ కూడలి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ 30వ వార్డు కుమ్మరవీధిలో దోమల బెడదతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. సాయంత్రం 6 గంటలకు దోమల దండయాత్ర ప్రారంభమవుతుంది. వార్డులో డ్రైనేజీలు, ఖాళీ స్థలాల్లో కలుపు మొక్కలు, చెత్తాచెదారాల నిల్వలు పేరుకుపోయాయి. దీంతో దోమలు ఇళ్లలోకి చేరి ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దోమకాటు కారణంగా జ్వరాలు వస్తాయన్న భయంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. కాలువల్లో పైపైన చెత్త తొలగించడం, వీధిలోని కాలువలన్నీ నీటి నిల్వలతో దర్శనమివ్వడంతో దోమలకు ఆవాసాలుగా మారిపోయాయి. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది తూతూమంత్రంగా కాలువలు శుభ్రం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇటువైపు చూసిన దాఖలాలు లేవని, వర్క్ ఇన్‌స్పెక్టర్‌తో పనులు చేయిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఖాళీ స్థలాల్లో కలుపుమొక్కలు పేరుకుపోవడం దోమల వ్యాప్తికి కారణమని స్థానికులు చెబుతున్నారు. కుమ్మరవీధికి దోమల బెడద గతంలో ఎప్పుడూ లేదని, ఖాళీ స్థలంలో పిచ్చిమొక్కలు, చెత్త పేరుకుపోవడంతోనే నిత్యం యాతన పడుతున్నామని జనం వాపోతున్నారు. తూతూమంత్రంగా పొగ (ఫాగింగ్) కొడుతున్నారనేది ప్రజల విమర్శ. జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారులు దోమల బెడద నుంచి కుమ్మరవీధి వాసులకు విముక్తి కల్పించాలని స్థానిక ప్రజానీకం కోరుతున్నారు.



ఆవాసాల మధ్య ఖాళీ స్థలంలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు

అక్రమ నిర్మాణం తొలగింపు



సీతంపేటలో అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సీతంపేట, డిసెంబరు 16: సీతంపేట కనకమ్మవారి హరిజన వీధిలో గల యూఎల్‌సీ ల్యాండ్‌లో అక్రమంగా నిర్మాణం చేపట్టిన వాటిని అర్బన్ తహసీల్దార్ రమేష్ పర్యవేక్షణలో సోమవారం కూల్చివేశారు. రేసపువానిపాలెంకి సంబంధించి జరిగిన రెవెన్యూ సదస్సులో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు రావడంతో సిబ్బంది పరిశీలించిన అనంతరం ధ్రువీకరించుకున్న అనంతరం పోలీసు బందోబస్తు నడుమ తొలగించినట్లు తహసీల్దార్ రమేష్ తెలిపారు. ప్రభుత్వ భూములు, స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ స్పష్టం చేశారు.

కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి భక్తుల తాకిడి

జగదాంబ కూడలి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. సోమవారం అమ్మవారి దర్శనానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఉచిత దర్శనాలతో పాటు టిక్కెట్ దర్శనాల క్యూలైన్లు రద్దీగా మారాయి. మార్గశిర మాసోత్సవాలను పురస్కరించుకొని ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు నిత్యం వచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం, జలాభిషేకం, లక్ష్మీహోమం జరిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. సాయంత్రం ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలను భక్తులు ఆసక్తిగా తిలకించారు. వన్‌టౌన్ ఎస్ఐ విశ్వనాథ్ ఆలయ ముఖద్వారం వద్ద నిల్చుని ట్రాఫిక్‌ను నియంత్రించారు.

రేపటి నుంచి భగవద్గీతపై ప్రవచనం

డాబాగార్డెన్స్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భగవద్గీతలోని విభూతి యోగంపై ఆధ్యాత్మిక గురువు సుశీలాజీ ఈ నెల 18 నుంచి 22 వరకు ప్రవచనాలు చేయనున్నట్టు వేదాంత ఇనిస్టిట్యూట్ ఛారిటబుల్ ట్రస్టీ ఎస్.వి.సత్యనారాయణ (సత్యానంద) తెలిపారు. సోమవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ భగవద్గీతలోని 10వ అధ్యాయం విభూతి యోగంలో 42 శ్లోకాలు ఉన్నాయని, రోజూ సాయంత్రం ఆంధ్ర యూనివర్సిటీ డాక్టర్ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో సుశీలాజీ ప్రవచనమిస్తారని తెలిపారు. భగవద్గీత గురించి విద్యార్థి దశ నుంచే తెలుసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సభ్యులు కె.హరినాథ్‌రాజు, కేవీఆర్‌కే విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ఆర్ట్స్ కోర్సుల్లో పెరిగిన ప్రవేశాలు

... 5వ పేజీ తరువాయి

తరగతులు నిర్వహిస్తున్నారు. పూర్తిస్థాయి ఫ్యాకల్టీ 50 మంది ఉండగా, కాంట్రాక్టు ఫ్యాకల్టీ 25 మంది, గెస్ట్ ఫ్యాకల్టీ 105 మంది వరకూ ఉన్నారు.

ఉద్యోగాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి

ఆర్ట్స్ కాలేజీ పరిధిలో అడ్మిషన్లు భారీగా పెరుగుతున్నాయి. గడిచిన ఏడాది రిలీవ్ అయిన వారిలో 60 నుంచి 70 శాతం మందికి ఉపాధి అవకాశాలు కల్పించాం. ఆరేడు బ్రాంచీలకు చెందిన విద్యార్థులకైతే 90 శాతం మేర ఉద్యోగాలు వచ్చాయి. తరగతుల నిర్వహణ, విద్యార్థులకు అధ్యాపకు గైడెన్స్, ఉద్యోగ అవకాశాలు బాగుండడం వల్లే ఎక్కువ మంది విద్యార్థులు చేరుతున్నారు. డిమాండ్ ఉన్న కోర్సుల్లో రానున్న రోజుల్లో సీట్ల సంఖ్యను పెంచే ప్రతిపాదనలు ఉన్నాయి.

- ప్రొఫెసర్ ఎ.నరసింహరావు, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్

ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లతో నేడు రెవెన్యూ మంత్రి సమీక్ష

... 5వ పేజీ తరువాయి

చేరుకున్న మంత్రికి ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, వీఎంఆర్‌డీ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, ఆర్డీవో శ్రీలేఖ, తదితరులు స్వాగతం పలికారు. సమీక్ష కోసం రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా, సీసీఎల్ఏ అదనపు చీఫ్ కమిషనర్ ఎన్. ప్రభాకరరెడ్డి నగరానికి చేరుకున్నారు.

పౌర్ణమి పోటుకు తీరం కోత

... 5వ పేజీ తరువాయి

శాండ్ ట్రాప్ ఏరియాలో ఇసుకను తవ్వి సబ్‌మెరైన్ మ్యూజియం పరిసరాల్లో డంప్ చేయిస్తోంది. అయినప్పటికీ అదే ప్రాంతంలో సముద్రం కోతకు గురికావడం డ్రెడ్జింగ్ పనులపై అనుమానాలను రేకెత్తిస్తోంది. ఇలా ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు కోతకు గురవుతున్న తీరాన్ని పటిష్ఠం చేయడానికి వీఎంఆర్‌డీఏ ఇటీవలె రూ.200 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపించింది. వీటికి ఆమోదం లభిస్తే త్వరలో పనులు ప్రారంభం అవుతాయి.

దివ్యాంగుల గుర్తింపు శిబిరం 20న

విశాఖపట్నం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, వయోవృద్ధులకు సహాయ ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని ఈ నెల 20న దక్షిణ నియోజకవర్గం నీలమ్మ వేపచెట్టు వద్ద ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే శిబిరానికి సదరం ధ్రువపత్రం, ఆధార్‌కార్డు, రెండు పాస్‌ఫోటోలు, యూడీఐడీ కార్డు జెరాక్స్‌లు తీసుకురావాలన్నారు.

కరాటే పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రథమస్థానం

విశాఖపట్నం స్పోర్ట్స్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి కరాటే పోటీలు సోమవారం ఘనంగా ముగిశాయి. నగరంలోని విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్ పోర్టు స్టేడియంలో వాడొక్కై కరాటే సంఘం, డ్రాగన్ ఫోర్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ సంయుక్తంగా 2వ వైజాగ్ ఓపెన్ నేషనల్ కరాటే పోటీలు ఘనంగా నిర్వహించారు. 46 పాయింట్లతో ఆంధ్రప్రదేశ్ జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. 33 పాయింట్లతో తెలంగాణ ద్వితీయ స్థానాన్ని, 26 పాయింట్లతో పశ్చిమ బెంగాల్ తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను ఆంధ్రప్రదేశ్ జట్టుకు ముఖ్యఅతిథిగా హాజరైన సినీ నటుడు, వాడొక్కై కరాటే సంఘం చైర్మన్ సుమన్ తల్వార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎస్పీ శశిభూషణ్, బొచ్చ సురేష్, బడానా రాజశేఖర్, ది ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కంచరాన సూర్యనారాయణ, అంగ రాము, వై.నరసింహరాజు, వాడొక్కై కరాటే సంఘం అధ్యక్షుడు చిగురుపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



కరాటే బాలలతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

సంక్షేమ బోర్డు కోసం ఆటో డ్రైవర్ల వినతి



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు వినతిపత్రం సమర్పిస్తున్న ఆటోడ్రైవర్ల సంఘం ప్రతినిధులు

సీతమ్మధార, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తమపై ఆర్థిక భారం మోపే జీవో నెంబర్ 21, 31లను రద్దు చేయాలని కోరుతూ ఆటో డ్రైవర్లు, మోటార్ కార్మికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజును అభ్యర్థించారు. సోమవారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. పీఎఫ్, ఈఎస్ఐ పెన్షన్ వర్తించేలా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి విజ్ఞప్తి చేశారు. డ్రైవర్ల సమస్యలను ఫిబ్రవరిలో జరిగే శాసనసభ సమావేశాల్లో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ప్రయత్నిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు.

నవల, నాటికల పుస్తకావిష్కరణ

సీతంపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రచయిత తన అంతరంగం లోతుల్లోకి వెళ్లి, దాని గాఢతను పరిశీలించి కథ లేదా నాటిక రాస్తే చిరస్థాయిగా నిలిచిపోతుందని ప్రముఖ సాహితీవేత్త ద్విభాష్యం రాజేశ్వరరావు అన్నారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో విశాఖ రచయితల సంఘం ఆధ్వర్యంలో నుసర్ల సర్వేశ్వర శాస్త్రి రచించిన మూడు నాటికల సంపుటి, ఒక అపరాధ పరిశోధన నవల ఆవిష్కరణ సభ సోమవారం నిర్వహించారు. అరసం ప్రధాన కార్యదర్శి అడపా రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రముఖ సాహితీవేత్తలు ద్విభాష్యం రాజేశ్వరరావు, గాడేపల్లి సుందరరావులు నవల, కథాసంపుటిలను ఆవిష్కరించారు. డాక్టర్ ఎస్.కృష్ణబాబు, శిరేల సన్యాసిరావు, మేడా మస్తాన్ రెడ్డి, పరమేశ్వరరావు, కె.లతారాములు, పంతుల లలిత పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

విజయనగరం క్రైం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో 2020లో నమోదైన పోక్సో కేసులో నిందితుడు విశాఖపట్టణం జిల్లా పద్మనాభం మండలం పొట్నూరు గ్రామానికి చెందిన అయితి అప్పలనాయుడుకు పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.4 వేల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. విజయనగరం జిల్లా మెంటాడ మండలానికి చెందిన బాలిక నగరంలోని ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న సమయంలో అయితి అప్పలనాయుడికి పరిచయం ఏర్పడింది. నిందితుడు బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆటోలో వేర్వేరు ప్రాంతాలకు తీసుకువెళ్లి పలుమార్లు శారీరకంగా అనుభవించినట్టు వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ పి.వీరాంజనేయ రెడ్డి నిందితుడిని అరెస్టు చేసి... కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ పూర్తయ్యే విధంగా వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ పత్రాలు సమర్పించారు. నిందితుడు అప్పలనాయుడు బాలికపై అత్యాచారానికి పాల్పడినట్టు నేరం రుజువైంది. దీంతో పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి నిందితుడికి కఠిన కారాగార శిక్ష, జరిమానా విధించినట్టు తెలిపారు. త్వరితగతిన నిందితుడికి శిక్ష పడేలా వ్యవహరించిన దర్యాప్తు, ప్రాసిక్యూషన్ అధికారులను ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.

భూ సమస్యలు పరిష్కారమయ్యేనా?

... 5వ పేజీ తరువాయి

చేశారు. పెందుర్తి, ఆనందపురం ప్రాంతాల్లో చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి. పేదల ఇళ్ల కోసం శివారు ప్రాంతాల్లో చేపట్టిన ఐదు వేల ఎకరాల సమీకరణ పారదర్శకంగా జరగలేదనే వాదన ఉంది.

రీసర్వేలో తప్పులే తప్పులు

గత ప్రభుత్వ హయాంలో జిల్లాలోని 51 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే నిర్వహించారు. భూముల సరిహద్దులు, రికార్డుల్లో పేర్లు, సర్వే నంబర్లలో తప్పులపై 3,195 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో 330 ఫిర్యాదులు పరిష్కరించినట్టు కలెక్టర్ల సదస్సులో ఇచ్చిన నివేదిక వెల్లడిస్తోంది. అయితే రీసర్వేపై రైతుల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. దిగువస్థాయి రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్ల తీరు, అవగాహనలేమి, గ్రామస్థాయిలో ఒత్తిళ్ల మేర తప్పులు/అవకతవకలు జరిగాయని రైతులు ఆరోపిస్తున్నారు. రెండు నెలల క్రితం రీసర్వేపై నిర్వహించిన గ్రామ సభలపైనా రైతులు పెదవివిరుస్తున్నారు. భూముల సరిహద్దులు, రికార్డుల్లో పేర్లు, సర్వేనంబర్ల తప్పులు సరిదిద్దకపోతే భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు రావచ్చునని అంటున్నారు.

ఫ్రీహోల్డ్ అనుమతులపై ఆరోపణలు

జిల్లాలో 626 ఎకరాల డీపట్టా భూములకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు జారీచేశారు. గత ప్రభుత్వంలో కీలక స్థానంలో పనిచేసిన ఓ అధికారి, ఆయన బినామీలు నగర శివార్లలోని డి.పట్టాలు కలిగిన రైతులతో భూముల కొనుగోళ్లకు ముందే ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఆనందపురం మండలం గండిగుండంలో డీపట్టా భూములు చేతులు మారిన తరువాతే అప్పటి పాలకుల ఆదేశాల మేరకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు జారీచేశారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో 626 ఎకరాలకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు జారీ కాగా 138.96 ఎకరాలు రిజిస్ట్రేషన్ అయిపోయింది. ఆ సమయంలో ఆరోపణలు వెల్లువెత్తడంతో మిగిలిన భూముల రిజిస్ట్రేషన్ నిలిపివేశారు. ఈలోగా ప్రభుత్వం మారడంతో డీపట్టా భూములకు ఫ్రీహోల్డ్ జారీ నిలిపివేస్తూ ఆదేశాలు వచ్చాయి.

22-ఏ సమస్య పరిష్కారమయ్యేనా..

జిల్లాలో పలు భూములను నిషేధిత జాబితా 22-ఏలో చేర్చారు. వాటిలో జిరాయితీ, ప్రభుత్వం వద్ద కొనుగోలు చేసిన భూములు ఉన్నాయి. ఆయా భూముల యజమానులు ఏళ్ల తరబడి కలెక్టరేట్ చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. వివాదం లేని భూములను 22-ఎ నుంచి తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని జిల్లా యంత్రాంగం అనేక పర్యాయాలు లేఖలు రాయడంతో గత పాలకుల హయాంలో ఆంక్షలు సడలించారు. అయితే తొలగింపు ప్రక్రియ సావ్యంగా సాగలేదు. గత ప్రభుత్వం 22-ఎ నుంచి తొలగించిన భూముల్లో అత్యధికం పోర్టు, మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమరయోధులకు చెందినవి ఉన్నాయి. మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమరయోధులకు చెందిన భూములు 22-ఎ నుంచి తొలగించడంలో వైసీపీ పెద్దల హస్తం ఉందనే ఆరోపణలు ఉన్నాయి. కాగా, టైటిల్ విషయంలో క్లియర్‌గా ఉన్న భూములను 22-ఎ నుంచి తొలగించాలన్నదే బాధితుల విన్నపం.

దసపల్లా భూములపై గట్టిగా ఉంటారా?

వేల కోట్ల రూపాయల విలువైన దసపల్లా భూముల విషయంలో గత పాలకులు తాము అనుకున్నవిధంగా చేశారు. కోర్టు ఆదేశాలను చూపి 22-ఎ నుంచి తొలగించారు. ఇంకా అక్కడ భవన నిర్మాణాలకు వైసీపీ నేత కుమార్తెకు చెందిన నిర్మాణ కంపెనీతో స్థల యజమానులతో బలవంతపు ఒప్పందాలు చేశారు. దీనిపై అప్పట్లో టీడీపీ నేతలంతా స్పందించారు. ప్రభుత్వం వచ్చిన వెంటనే దసపల్లా భూములు స్వాధీనం చేసుకుంటామని, డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ రద్దు చేస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తాజాగా జిల్లా యంత్రాంగం నుంచి దసపల్లా భూములపై నివేదిక తెప్పించుకుంది.

కన్వేయన్స్ డీడ్స్ కోసం ఎదురుచూపు

టీడీపీ ప్రభుత్వ హయాం (2014-19)లో నగరంలో సుమారు 70 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరుచేశారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకున్న వారికి 296, 388 జీవోల ప్రకారం సీఎం హోదాలో 2016లో చంద్రబాబునాయుడు పట్టాలు పంపిణీ చేశారు. వారికి 2018లో కన్వేయన్స్ డీడ్స్ ఇవ్వాల్సి ఉండగా, ప్రభుత్వం మారడంతో కార్యరూపం దాల్చలేదు. కన్వేయన్స్ డీడ్స్ ఇస్తే ఇంటి స్థలంపై యజమానికి సర్వహక్కులు కలుగుతాయి. డీడ్స్ వచ్చిన వెంటనే స్థలాలు రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. అందుకోసం వారంతా ఆశగా ఎదురుచూస్తున్నారు.

వైసీపీ నేతల అక్రమాలపై మహా ఉదాసీనత

... 5వ పేజీ తరువాయి

భవనంలో ఉల్లంఘనలు కనిపించకపోవడం ఆశ్చర్యకరం. దీనిపై పత్రికల్లో కథనాలు ప్రచురితమైనా ఇంతవరకూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. జీవీఎంసీ జోన్-6 పరిధి వడ్లపూడిలో వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య భారీ అపార్టుమెంట్ నిర్మాణం చేపట్టారు. పార్కింగ్‌కు వాడాల్సిన సెల్లార్‌లో హోటల్ ఏర్పాటుచేయడంతోపాటు భవనంపై అదనపు అంతస్థు వేసి పెంట్‌హౌస్ నిర్మించేసుకున్నారు. దీనిపై అపార్టుమెంట్‌లోని ఫ్లాట్‌ల యజమానులు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా కనీసం నోటీసులు కూడా జారీ చేయలేదు. జీవీఎంసీ జోన్-2 మధురవాడ సర్వే నంబర్ 2లోని పట్టా నంబర్ 595లో అపార్టుమెంట్ నిర్మాణానికి ప్లాన్ కోసం జీవీఎంసీకి వైసీపీ నేత, మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ దరఖాస్తు చేసుకున్నారు. పట్టానంబర్ 595లో కాకుండా పట్టా నంబర్ 585లోని స్థలంలో యథేచ్ఛగా అపార్టుమెంట్ ప్రారంభించేశారు. దీనిపై మహేష్ అనే వ్యక్తి ఆధారాలతో అధికారులకు ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకోలేదు సరికదా...భవన నిర్మాణం శరవేగంగా పూర్తిచేసేందుకు తమ సహాయ సహకారాలను పరోక్షంగా అందించారనే ఆరోపణలు ఉన్నాయి. చివరకు హైకోర్టు ఆదేశిస్తే గానీ జీవీఎంసీ అధికారులు విచారణ జరపడానికి కదల్లేదు. జీవీఎంసీ అధికారుల విచారణలో ఎంవీవీపై ఆరోపణలు వాస్తవమేనని నిర్ధారణ అయినప్పటికీ పనులు నిలుపుదల చేయాలని ఆదేశించకపోవడం వైసీపీ నేతల పట్ల ఇప్పటికీ జీవీఎంసీ అధికారులకు ప్రేమాభిమానాలు తగ్గలేదనే విమర్శలకు బలాన్ని చేకూర్చుతోంది.

జీవీఎంసీ జోన్-2 పరిధిలో మధురవాడ నుంచి బక్కన్నపాలెం నవోదయ పాఠశాల రోడ్డు విస్తరణకు గతంలో నగర పాలక సంస్థ స్థల సేకరణ చేపట్టింది. రోడ్డు విస్తరణకు అవసరమైన ప్రైవేటు స్థలాలను తీసుకునేందుకు స్థల యజమానులకు టీడీఆర్‌లు జారీచేసింది. అందులో భాగంగానే మధురవాడ జాతీయరహదారికి ఆనుకుని ఉన్న ఒక వైసీపీ చోటా నేత షాపింగ్ కాంప్లెక్స్‌లో కొంత స్థలం రోడ్డు విస్తరణలో పోతుండడంతో టీడీఆర్ జారీచేశారు. భవన యజమాని టీడీఆర్‌లు తీసుకోవడంతో, జీవీఎంసీ అధికారులు మార్కింగ్ చేసిన మేర భవనాన్ని తొలగించి స్థలాన్ని రోడ్డు విస్తరణకు అప్పగించాలి. కానీ టీడీఆర్ తీసుకున్న వైసీపీ నేత షాపింగ్ కాంప్లెక్స్‌లో రోడ్డు విస్తరణకు అవసరమైన స్థలం ఇవ్వకపోగా, అదే భవనంపై అదనపు అంతస్థు నిర్మాణం ప్రారంభించారు. దీనిపై పత్రికల్లో కథనాలు ప్రచురితమైనా టౌన్‌ప్లానింగ్ అధికారులు మాత్రం ఆ భవనంలో రోడ్డు విస్తరణకు అవసరమైన స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించలేదు. వీటిపై టౌన్‌ప్లానింగ్‌లోని ఒక అధికారి వద్ద ప్రస్తావించగా, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడానికి సిద్ధపడినా కూటమి నేతలే అడ్డుపడుతున్నారని చెప్పుకొచ్చారు. గుడివాడ అమర్‌నాథ్ భవనంపై చర్యలు తీసుకోవడానికి వెళితే కూటమిలోని ముఖ్య నేత ఒకరు స్వయంగా తమ ఉన్నతాధికారికి ఫోన్ చేసి భవనం కూల్చివేత వంటి తీవ్ర చర్యలు తీసుకోవద్దని ఆదేశించారన్నారు.

చిన్నారులకు ఆరోగ్య కార్డులు

... 5వ పేజీ తరువాయి

ఖర్చులను కూడా ప్రభుత్వమే భరిస్తుంది. ఈ బాధ్యత కూడా స్థానిక ఆరోగ్య శాఖ సిబ్బంది చూసుకోవాలి. జిల్లాలో డిస్ట్రిక్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ కేజీహెచ్‌లో ఉంది. అవసరమైన వారికి అక్కడే సర్జరీలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటారు. గ్రహణం మొర్రి, పుట్టుకతో వినికిడి సమస్య, మాట్లాడలేకపోవడం వంటి ఇబ్బందులను గుర్తిస్తే వారికి అక్కడే వైద్య సేవలు అందిస్తారు. జిల్లాలో పేరెంట్ టీచర్, మీటింగ్ జరిగిన రోజు నుంచి ఈ పరీక్షలు ప్రారంభమయ్యాయి.

ఆరోగ్య సమాచారంతో కార్డులు

పరీక్షలు నిర్వహించిన అనంతరం విద్యార్థి ఆరోగ్య సమాచారంతో కూడిన కార్డులను అందించనున్నారు. ఇందులో చిన్నారి ఎత్తు, బరువుతోపాటు మరో ఏడు రకాల వివరాలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. అలాగే, చిన్నారికి సంబంధించి ఏమైనా ఇబ్బందులు ఉంటే అందులో పొందుపరుస్తారు. ఆరు నెలలకు ఒకసారి ఈ ఆరోగ్య పరీక్షలను నిర్వహించనున్నారు. పరీక్షలు నిర్వహించిన ప్రతిసారి కొత్త కార్డులు అందించనున్నారు. రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ స్క్రీనింగ్ ప్రోగ్రామ్‌లో ప్రధానంగా నాలుగు 'డీ'లపై దృష్టిసారించామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. వ్యాధులు (డిసీజెస్), శరీర అభివృద్ధిలో ఆలస్యం (డెవలప్‌మెంట్ డిలేస్), వైకల్యం (డిఫార్మిటీస్), డిఫిషియన్సీ (లోపాలు)ను గుర్తించేలా స్క్రీనింగ్ ప్రక్రియ సాగుతోందన్నారు. చిన్నారుల్లో కొన్ని రకాల అనారోగ్య సమస్యలు, లోపాలు ఉన్నప్పటికీ వాటిని తల్లిదండ్రులు ఆలస్యంగా గుర్తిస్తారని, దీనివల్ల మెరుగైన వైద్య సేవలు అందించడం సాధ్యం కాదన్నారు. ముఖ్యంగా మాట్లాడలేకపోవడం, వినికిడి వంటి ఇబ్బందులను చిన్న వయసులోనే గుర్తించకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నా యన్నారు. ఇటువంటి సమస్యలను గుర్తించి మెరుగైన చికిత్స అందించేందుకు ఈ స్క్రీనింగ్ ప్రోగ్రామ్ దోహదపడుతుందన్నారు.

అమ్మో.. అగనంపూడి జంక్షన్!

» రోడ్డు దాటాలంటే టెన్షన్..టెన్షన్
» తరచూ ప్రమాదాలతో భీతిల్లుతున్న ప్రజలు
» ఇక్కడి డివైడర్‌ను పూర్తిగా మూసివేయాలని డిమాండ్ చేస్తున్న స్థానికులు

అగనంపూడి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి అగనంపూడి ప్రధాన జంక్షన్ ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇక్కడ రహదారి మధ్య గల డివైడర్‌ను మూసివేయకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పాత అగనంపూడి, శాంతినగర్, శ్రీనివాసనగర్, అన్నపూర్ణానగర్, కేఎస్ఎన్‌రెడ్డి వాసులు కూడలికి చేరుకునేందుకు రాంగ్ రూట్‌లో వచ్చి రహదారిని దాటుతున్నారు. ఈ క్రమంలో గాజువాక వైపు నుంచి వచ్చే వాహనాలు ఢీకొనడంతో పలువురు ప్రమాదాల బారినపడుతున్నారు. ఈ జంక్షన్‌లో డివైడర్‌ను మూసివేయకపోవడం వల్లే ఆయా గ్రామాల ప్రజలు రాంగ్ రూట్‌లో కూడలికి వస్తున్నారు. అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాలకు వెళ్లే వారిలో అధిక శాతం మంది రాంగ్ రూట్‌లో వస్తుండడంతో తరచూ అనకాపల్లి వైపు నుంచి వచ్చే వాహనాలు ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. దీనివల్ల రాంగ్ రూట్‌లో వచ్చే వారితో పాటు నిబంధనలను పాటిస్తూ వాహనాలను నడుపుతున్న వారు సైతం ప్రమాదాల బారినపడి ఒక్కోసారి ప్రాణాలను కూడా పోగొట్టుకుంటున్నారు. ఇప్పటికే ఎంతో మంది క్షతగాత్రులుగా మారారు. జాతీయ రహదారి కావడంతో నిత్యం ఈ మార్గంలో వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కూడలిలో డివైడర్ మూసివేయకపోవడం వల్ల రోడ్డు దాటే క్రమంలో పలువురు పాదచారులు కూడా ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో ఈ కూడలిలో గ్యాస్ సిలిండర్ల లారీ అదుపు తప్పి బోల్తా పడింది. అలాగే చట్టివానిపాలేని చెందిన మహిళను ద్విచక్ర వాహనం ఢీకొనడంతో మృత్యువాత పడింది. ఈ కూడలిలోని డివైడర్‌ను మూసివేసి అగనంపూడి శివాలయం సమీపంలో కటింగ్‌ను ఏర్పాటు చేస్తే ప్రమాదాలు నివారించవచ్చునని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. ఇదే విషయాన్ని ట్రాఫిక్ పోలీసులకు పలుమార్లు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ జంక్షన్‌లోని డివైడర్‌ను మూసివేయాలని కోరుతున్నారు.


ప్రమాదాలకు నిలయంగా మారిన అగనంపూడి జంక్షన్

డివైడర్‌ను మూయకపోవడం వల్లే ప్రమాదాలు

-మోటూరి వెంకటరమణ, పెదమడక



అగనంపూడి జంక్షన్‌లోని డివైడర్‌ను మూయకపోవడంతో పరిసర ప్రాంతాల వాహన చోదకులు రాంగ్ రూట్లో వస్తున్నారు. రెండువైపులా నుంచి ఒకేసారి వాహనాలు రావడంతో పాటు తప్పించుకునే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. పాదచారులు కూడా రోడ్డు దాటేటప్పుడు ప్రమదాల బారిన పడుతున్నారు. డివైడర్‌ను ఇక్కడ మూసివేసి కూడలికి దూరంగా వాహనాలు వచ్చే పోయేలా కటింగ్ ఏర్పాటు చేయాలి.


ఎక్స్‌కవేటర్ సాయంతో డెబ్రిస్‌ను లారీలో వేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

పేరుకుపోయిన డెబ్రిస్ తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెదగంట్యాడ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ పారిశ్రామికవాడ ప్రధాన రహదారికి ఇరువైపులా గుట్టలుగా పేరుకుపోయిన డెబ్రిస్‌ను తొలగించేందుకు జీవీఎంసీ ప్రజారోగ్యశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకోసం ఒక ఎక్స్‌కవేటర్‌తో పాటు రెండు లారీలను వినియోగిస్తున్నారు. 'ఇది డంపింగ్ యార్డు కాదు రోడ్డే..' శీర్షికతో ఈ నెల 12న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి డెబ్రిస్‌ను తొలగిస్తున్నారు. ఇక్కడి డెబ్రిస్ మొత్తాన్ని తరలించేందుకు సుమారు వారం రోజుల సమయం పడుతుందని అధికారులు అభిప్రాయ పడుతున్నారు. 'ఇక్కడ చెత్త, డెబ్రిస్ వేయడం నిషేధమని, దీనిని అతిక్రమించిన వారు శిక్షార్హులు' అనే బోర్డులను ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే రాత్రి వేళల్లో నిఘా పెడతామని పేర్కొన్నారు.

'నేవల్ సివిల్ ఎంప్లాయీస్' ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం


శిబిరంలో రక్తదానం చేస్తున్న సొసైటీ సభ్యులు

సింధియా, డిసెంబర్ 16, (ఆంధ్రజ్యోతి): నేవల్ సివిల్ ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ సొసైటీ 70వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మేఘాద్రిపేటలోని కళా మేఘా ఆడిటోరియంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నేవల్ డాక్‌యార్డ్ జనరల్ మేనేజర్ కమోడర్ అజ్మతుల్లాఖాన్ మాట్లాడుతూ సొసైటీ ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సొసైటీ పురోభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందిస్తానన్నారు. అనంతరం రక్తదాతలకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రంలో సొసైటీ సూపర్‌వైజర్ రెడ్డి వెంకటరావు, ప్రతినిధులు విప్లవ్‌కుమార్, అంజనీ రాజేశ్, మదర్ బ్లడ్ సెంటర్ అధ్యక్షుడు జీఎల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజనాన్ని' పరిశీలించిన ఎంఈవోలు

పెదగంట్యాడ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్లిముక్కు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందించిన ఆహారాన్ని పెదగంట్యాడ మండల విద్యాశాఖాధికారులు ఈశ్రీనివాసరావు, కె.రమణాజీలు సోమవారం పరిశీలించారు. ప్రభుత్వం పేర్కొన్న మెనూ ప్రకారం ఆహారం, గుడ్డు, కూరలు అందుతున్నాయో, లేదో ఆరాతీశారు. కొద్దిగా ఆహారాన్ని తిని సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆహారం సరిపోతుందా, లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు పెట్టే భోజనాల విషయంలో రాజీ పడవద్దని నిర్వాహకులకు వారు సూచించారు.

'కార్మికుల జోలికొస్తే సత్తా చూపిస్తాం'

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్మికులను ఇబ్బందులకు గురి చేసేందుకు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని, ఇది మంచి పద్ధతి కాదని.. కార్మికుల జోలికొస్తే తమ సత్తా చూపిస్తామని ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. యూనియన్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేతనాల కోసం కార్మికులు ఎదురుచూడాల్సిన దుస్థితి ఉక్కు కర్మాగారంలో నెలకొందన్నారు. ఉక్కు యాజమాన్యం కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందని ఆరోపించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే రానున్న కాలంలో భారీ ఎత్తున ఆందోళనకు దిగుతామని, ఇందుకు కార్మికులంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూనియన్ ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ

అగనంపూడి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక సర్వహిత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పలు పేద కుటుంబాలకు సోమవారం నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ప్రతినిధులు మాట్లాడుతూ ఆదపలో ఉన్న పేదలను ఆదుకోవడమే తమ ధ్యేయమన్నారు. ప్రతినిధులు గుదే సుశీలగజేంద్రరరావు, పట్టా రామ అప్పారావు, గోవిందరావు, నరసింగరావు, మస్తాన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

వేపగుంట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జీవీ ఎంసీ 94వ వార్డులో రూ.80 లక్షలతో రోడ్లు, కాలువల అభివృద్ధికి సోమవారం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశామన్నారు చీమలాపల్లి రోడ్డు విస్తరణపై పలువురు ప్రశ్నించగా అభివృద్ధి పనులకు ఆటంక పరచకూడదని, అభ్యంతరాలుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, జెడ్సీ కె.హైమావతి, ఈఈ చిరంజీవులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

రహదారి, కాలువ పనులు ప్రారంభం

ఎన్ఏడీ జంక్షన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు విమాన్‌నగర్ వెస్ట్‌లైన్, రోడ్డు నంబరు 4లో రూ.12.85లక్షలతో చేపట్టనున్న రహదారి, కాలువ పనులకు సోమవారం కార్పొరేటర్ బొమ్మిడి రమణ శంకుస్థాపన చేశారు. బుచ్చిరాజుపాలెం రెడ్డివీధిలో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించాలి

మల్కాపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థీ సృజనాత్మకంగా ఆలోచించి సమాజానికి ఉపయోగపడే పరికరాలను తయారు చేయాలని, సాంకేతిక రంగంలో రాణించి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ములగాడ తహసీల్దార్ భుజంగరావు సూచించారు. స్థానిక ప్రైవేటు పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో సాంకేతికత పెరిగేందుకు యాజమాన్యాలు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వివిద ప్రదర్శనలను తిలకించి, వాటి గురించి విద్యార్థులు వివరించిన విధానాన్ని ఆయన ప్రశంసించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ తొనంగి వెంకటరమణి తహసీల్దార్‌ను సత్కరించారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

పెందుర్తి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లిన యువతి తిరిగి రాకపోవడంతో ఆమె సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సతీష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదనరవలోని శివసాయి నగర్‌కు చెందిన వాండ్రాసి లక్ష్మీప్రసన్న (21) ఈనెల 13న కళాశాలకని వెళ్లి ఇంతవరకు ఇంటికి చేరలేదు. బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆమె సోదరుడు బాలపవన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు సీఐ అదృశ్యం కేసు నమోదు చేశారు.

వేపగుంట జోన్‌లో తొమ్మిది ఫిర్యాదులు స్వీకరణ

వేపగుంట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక (పీఆర్‌జీఎస్)కు 9 ఫిర్యాదులు వచ్చాయి. ఆర్.ఆర్.వి.పురం వాసులకు ఎల్‌జీ యాజమాన్యం పరిహారం ఇవ్వలేదని, 95వ వార్డులో డ్రైనేజీ లీకయిందని సుజాతనగర్‌లో కాలువలకు మరమ్మతులు చేపట్టాలని, బస్టాప్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈఈ చిరంజీవులు వినతిపత్రాలు స్వీకరించారు.

కల్వర్టుకు మరమ్మతులు ప్రారంభం

గోపాలపట్నం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సింహాచలం రైల్వే స్టేషన్ రోడ్డులో శిథిలావస్థకు చేరిన కల్వర్టుకు మరమ్మతులు చేపడుతున్నారు. స్టేషన్ ఎదురుగా కల్వర్టుపై ఏర్పాటు చేసిన గ్రిల్ పూర్తిగా పాడైపోవడంతో వాహన చోదకులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రైల్వే అధికారులు శిథిల గ్రిల్ స్థానంలో కొత్తది ఏర్పాటు చేస్తున్నారు.

పీజీఆర్ఎస్‌కు 23 వినతులు

గాజువాక, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 23 వినతులు వచ్చాయి. ప్రధానంగా వీధుల్లో సంచరిస్తున్న పందులు, కుక్కలను నియంత్రించాలని, డస్ట్‌బిన్లలోని చెత్తను ఏరోజుకారోజు తరలించాలని, జీర్ణవస్థకు చేరుకున్న డ్రైనేజీలకు మరమ్మతులు చేపట్టాలని, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని, దోమల నిర్మూలనకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని, తదితర సమస్యల పరిష్కారం కోరుతూ పలు వార్డులకు చెందిన ప్రజలు జోనల్ కమిషనర్ శేషాద్రికి వినతులు అందజేశారు. ఆయా ఫిర్యాదులను పరిశీలించి త్వరితంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

పని దినాల్లో ఏకోపాధ్యాయ పాఠశాల మూతపడదు

ఎంఈవో శ్రీనివాసరావు

పెదగంట్యాడ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పని దినాల్లో ఏకోపాధ్యాయ పాఠశాల మూతపడకుండా ప్రత్యామ్నాయంగా ఉపాధ్యాయులను ఏర్పాటు చేస్తున్నామని మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు తెలిపారు. మరడ దాసరిపేట ఏకోపాధ్యయ పాఠశాలలో ఒకే విద్యార్థి ఉన్నా ఇదే విధానాన్ని అమలు చేస్తామన్నారు. ఆ పాఠశాల టీచర్ సెలవు పెడితే సమీపంలో ఉన్న స్కూల్ నుంచి మరో ఉపాధ్యాయుడిని కానీ క్లస్టర్ రిసోర్స్ మొబైల్ టీచర్‌ను గానీ డిప్యూటేషన్‌పై పంపిస్తామన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలలో టీచర్ సెలవు పెడితే ఆ రోజు స్కూల్‌కు సెలవు అనే ఆరోపణలకు తావులేదని ఆయన పేర్కొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

అగనంపూడి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక ఉమామహేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా విచ్చేసి వివిధ రకాల మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ విధిగా మొక్కలు నాటాలని కోరారు.

కార్యక్రమంలో స్థానిక నాయకులు గంతకోరు అప్పారావు, బి.సత్యనారాయణ, ఎం.వాసు, అప్పలరాజు, సోమేశ్వరరావు, కొండలరావు, ఎం.ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● పుష్ప-2 : జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీకన్య సంగం, శరత్, మెలోడి, శరత్, కిన్నెర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ, నరసింహ, సుకన్య, సౌజన్య, మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని, లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), శ్రీరాములమ్మ, గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 48, టమాటా17, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 36, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 30, బీరకాయలు 44, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 22, క్యారెట్ 54 దొండకాయలు 36, బంగాళదుంపలు 32, అరటికాయ 6, మునక్కాడలు (కిలో) 120, అల్లం 56, బరబాటి 34, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 24 దోసకాయలు 26, వెల్లుల్లి 300, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 56, పొటల్స్ 48, కీరదోస 28, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 34, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	620
విజయనగరం	624
శ్రీకాకుళం	624

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	103
ఫారం ధర	123
విత్ స్కిన్	216
స్కిన్‌లెస్	226

ధనుర్మాసోత్సవాలకు శ్రీకారం


పూజలందుకున్న గ్రీన్‌సిటీలోని శ్రీవారు, ఉక్కు టౌన్‌షిప్ ఆలయంలోని వేంకటేశ్వరస్వామి

కూర్మన్నపాలెం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసోత్సవాలను సోమవారం పలు శ్రీవారి ఆలయాల్లో వైభవంగా ప్రారంభమయ్యాయి. 87వ వార్డు పరిధి రాజులపాలెం కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో, 88వ వార్డు వైజాగ్ ప్రొఫైల్స్ గ్రీన్‌సిటీ శ్రీలక్ష్మీ ఆండాల్ సమేత వైభవ్ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఉదయం నెలగంటతో ధనుర్మాస పూజా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో ఆయా ఆలయాలకు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపై గల వేంకటేశ్వర వినాయకస్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులు నారాయణాచార్యులు, లక్ష్మణాచార్యుల ఆధ్వర్యంలో వేదపండితులు నెలగంట పెట్టి ధనుర్మాసోత్సవాలను ప్రారంభించారు. అనంతరం శ్రీవారికి పూజలు జరిపారు. అలాగే షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో ప్రత్యేక వేదికపై గోదా రంగనాయకులను ఆశీనులను చేసి వేద పండితులు తిరుప్పావై పూజా కార్యక్రమాలను చేపట్టారు. తుంగ్లాంలోని విజయరాఘవస్వామి ఆలయంలో సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రారంభించిన ధనుర్మాసోత్సవాల్లో భాగంగా కర్పూర హారతి, నీరాట్ల ఉత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా కుడారై ఉత్సవాలు, ముక్కోటి ఏకాదశి, శ్రీగోదారంగనాథుల కల్యాణాన్ని జరుపుతామని నిర్వాహకులు పేర్కొన్నారు. అర్చకులు భావనారాయణ స్వామి, మనోజ్ స్వామి, హరినారాయణ స్వామిలు ధనుర్మాస వ్రత వైభవం గురించి వివరించారు. ఆలయ ప్రాంగణంలో సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు.


పట్టాలపై ఆవులు మేత మేస్తుండడంతో రైలింజన్‌ను ఆపిన దృశ్యం

రైల్వే డ్రైవర్ చాకచక్యంతో పశువులకు తప్పిన ప్రాణాపాయం

ఆటోనగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఓ రైలు ఇంజన్ డ్రైవర్ చాకచాక్యంగా వ్యవహరించడంతో పట్టాలపై మేత మేస్తున్న పశువులకు ప్రాణాపాయం తప్పింది. రైలు వస్తున్నందున ఆటోనగర్ డీ-బ్లాక్‌లోని చుక్కవానిపాలెం వద్ద సోమవారం ఉదయం రైల్వే క్రాసింగ్ గేటు వద్ద గేటు వేశారు. అయితే ఆ సమయంలో రైల్వే ట్రాక్‌పై కొన్ని ఆవులు మేత మేస్తున్నాయి. రైలు వస్తున్నట్టు సమాచారం ఉన్నప్పటికీ అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది కానీ గేటు వద్ద ఆగిన వాహనదారులు గానీ పశువులను పట్టాల పైనుంచి పక్కకు తరలించే ప్రయత్నం చేయలేదు. ఇంతలో ఓ రైలు ఇంజన్ శ్రీనగర్ మీదుగా వడ్లపూడి వైపు వచ్చింది. అయితే ఆ రైలింజన్ డ్రైవర్ పట్టాలపై పశువులు మేత మేస్తుండడాన్ని గమనించి వాటికి ఎలాంటి ప్రమాదం జరగకుండా కొన్ని సెకన్ల పాటు రైలును ఆపారు.

అనంతరం పశువులు పట్టాలపై నుంచి పక్కకు వెళ్లాక ఆ రైలింజన్ ముందుకు సాగింది. మానవతా దృక్పథంతో పశువులకు ప్రాణాపాయం కాకుండా రైలింజన్ వ్యవహరించిన తీరును పలువురు ప్రశంసించారు.

'ఆటో కార్మికులంతా టీడీపీ సభ్యత్వాలు పొందాలి'

కూర్మన్నపాలెం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులందరూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలను తీసుకుని కుటుంబాలకు భరోసా ఇవ్వాలని టీడీపీ 86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ అన్నారు. సోమవారం వుడానగర్ బోర్డు, రాజీవ్ నగర్, రాసాలమ్మ కాలనీ, దువ్వాడ కాలనీలకు చెందిన ఆటోడ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు, సన్నకారు రైతులు, కూలీలు, కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేగుంట శ్రీనివాస్, జగదీశ్, వెంకట అప్పారావు, నాగార్జున, వెంకట సుబ్బయ్య, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఉమా రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

సింధియా, డిసెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): మార్గశిర మాస ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని 40వ వార్డు పరిధి షిప్‌యార్డు కాలనీలో గల ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి అర్చకులు శ్రీను ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము ఐదు గంటల నుంచే శివయ్యకు రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం చేపట్టిన దీపారాధనలో కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావుతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు పరిధి జాబిలి హిల్స్‌లో గల ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి ఆరుద్ర నక్షత్ర యుక్త యుక్త రుద్రాభిషేకాలు నిర్వహించగా, అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో పలువురు భక్తులు విష్ణు, లలితసహస్రనామ పారాయణాలను పఠించారు.

కారులో నుంచి బంగారు నగలు, నగదు అపహరణ

అనకాపల్లి టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై కొత్తూరు సమీపంలో ఆదివారం రాత్రి ఒక కారులో నుంచి నగలు, నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. పట్టణ ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపిన సమాచారం ప్రకారం.. విశాఖ జిల్లా పెందుర్తికి చెందిన తెల్లాకుల హర్షబాబు, కుటుంబ సభ్యులు కలిసి ఈ నెల 13న అరకు, పాడేరు, లంబసింగి ప్రాంతాల సందర్శనకు వెళ్లారు. ఆదివారం రాత్రి నర్సీపట్నం మీదుగా అనకాపల్లి వైపు వస్తూ కొత్తూరు వద్ద జాతీయ రహదారి పక్కన కారు పార్కింగ్ చేసి దాబాలో భోజనానికి వెళ్లారు. ఇదే అదనుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు కారు పక్క డోర్ అద్దాన్ని పగులగొట్టి లోపల ఉన్న 53 గ్రాముల బంగారు నగలు, రూ.40 వేల నగదు, ఐఫోన్‌ను అపహరించుకుపోయారు. భోజనం చేశాక కారు వద్దకు వచ్చిన వారు చోరీ జరిగినట్టు గుర్తించారు. ఆదివారం రాత్రి ఇంటికి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం హర్షబాబు అనకాపల్లి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

సదస్సులో ఇచ్చిన దరఖాస్తు కాపీ పంపించండి

» పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తిరూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో సమస్యల పరిష్కారం కోరుతూ రైతులు ఇచ్చిన దరఖాస్తుల కాపీలను తనకు పంపాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అధికారులను ఆదేశించారు. ఆయా సమస్యల సత్వర పరిష్కారానికి ఈ విధానం దోహదపడుతుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని సదస్సులకూ తాను హాజరుకాలేనని, అందువల్ల సమస్యలన్నీ తెలిసే అవకాశం లేదన్నారు. మండలంలోని చింతలఅగ్రహారం రామాలయం వద్ద సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడారు. భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రభుత్వ రాజ ముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలను మంజూరు చేస్తామన్నారు. స్థానిక ఉన్నత పాఠశాల స్థలంలో స్థానికులు ఆక్రమణ యత్నాలు చేస్తున్నారని సర్పంచి దాడి గోపిఅప్పలనాయుడు, తదితరులు ఫిర్యాదు చేశారు. ఇళ్ల మరమ్మతులకు సింహాచలం దేవస్థానం అధికారులు అడ్డు పడుతున్నారని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మువ్వన దేముడు, వైస్ ఎంపీపీ దాడి వరలక్ష్మి, సదరం బీమేశ్వరరావు, ఎస్‌డీసీ సీతారామయ్య, తహసీల్దారు ఆనందకుమార్, జడ్పీ హేమలత, మాజీ ఎంపీపీ కాళ్ల వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. కాగా వేపగుంట, పినగాడి ప్రధాన రహదారి విస్తరణ పరిధిని తగ్గించాలని చీమలాపల్లి వాసులు కోరారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు వాహనం వద్దకు చేరుకుని వినతిపత్రం సమర్పించారు.


సదస్సులో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గణబాబు

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు: ఎమ్మెల్యే గణబాబు


రెవెన్యూ సదస్సులో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

ఆర్పీపేట,(కంచరపాలెం), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాల మంజూరుకు కృషిచేస్తామని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పేర్కొన్నారు. ఐటీఐ జంక్షన్ వద్ద సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే వినతులను స్వీకరించారు. దశాబ్దాలుగా నివసిస్తూ పట్టాలు లేని పేదలందరికీ పట్టాల మంజూరుకు కృషిచేస్తున్నామన్నారు. జడ్సీ రాము, సునీత, పెంటకోట అజయ్‌బాబు,శరగడం రాజశేఖర్, కుట్టా కార్తీక్, కిల్లి శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

వెంకటాద్రిపై ధనుర్మాసోత్సవాలు ప్రారంభం

పెందుర్తి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటాద్రి శిఖరంపై గల వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ధనుర్మాసోత్సవాలు ప్రారంభమాయ్యాయి. స్వామి విగ్రహాన్ని గంగానదీ జలాలతో అభిషేకించి, ధవళ వస్త్రాలు ధరింపజేశారు.. గోదాదేవిని పట్టువస్త్రాలు, ఆభరణాలతో అలంకరించారు. ముత్యాలపల్లికిలో గోదాదేవి సమేత శ్రీనివాస ఉత్సవమూర్తులను అంతరాలయంచుట్టూ తిరువీధి నిర్వహించారు. భక్తులు, సామూహిక తిరుప్పావై పఠించారు. అర్చకులు ధనుర్మాస విశిష్టత, గోదాదేవి పాశురాలను వివరించారు.


పెందుర్తిలో ధనుర్మాస వైభవాన్ని వివరిస్తున్న దృశ్యం


వేపగుంటలో గోదాదేవి, కృష్ణుని విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ

వేపగుంటలో...

వేపగుంట: నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై కొలువైన కల్యాణ వెంకటేశ్వరాలయంలో సోమవారం ఘంటారావంతో ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. అంతరాలయంలో ఏర్పాటు చేసిన పీఠంపై గోదాదేవి, శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు, తిరుప్పావై ప్రవచనం చేశారు. గోదాదేవి ఉత్సవ విగ్రహాలకు సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీలక్ష్మీనరసింహనగర్‌లోని గోపీ జనవల్లభ స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి.

ఎన్ఏడీ జంక్షన్: విమాన్‌నగర్ వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల సందర్భంగా గోదా రంగనాథుల దేవాలయ ప్రదక్షిణ, తిరుప్పావై సేవ, నిత్యారాధన చేశారు.

కేకుల స్పెషల్... క్రిస్మస్ కలర్‌ఫుల్

క్రిస్మస్.. కేక్.. ఈ రెండింటిని విడదీయలేం. కేక్ లేకుంటే ఆ సెలబ్రేషన్ అసంపూర్ణమే. క్రిస్మస్ కేక్స్‌లో ప్రపంచవ్యాప్తంగా పేరొందిన 12 వెరైటీలున్నాయి. వీటితో క్రిస్మస్ కలర్‌ఫుల్‌గా జరుపుకోవడం ఆనవాయితీ. ఆయా దేశాల్లో ప్రసిద్ధి చెందిన ఈ కేక్స్ మన దేశంలోనూ వెరైటీగా రూపొందిస్తున్నారు. క్రిస్మస్ నెల అంతా ఈ పన్నెండు కేకలను చాలామంది రెండు రోజులకు ఒకటి చొప్పున ఇంట్లో తయారుచేసుకుని రుచి చూస్తుంటారు. మరికొంతమంది బేకరీల్లో కొనుగోలు చేస్తారు.

- వెంకోజీపాలెం, ఆంధ్రజ్యోతి



స్పెషల్ కేక్స్ తయారుచేస్తున్న నగర మహిళలు

- హోంమేడ్ కేకులకు పెరుగుతున్న ఆదరణ
- విదేశాలకూ ఎగుమతి చేస్తున్న వైనం
- కేక్ లవర్స్‌తో కిటకిటలాడుతున్న బేకరీలు

క్రిస్మస్ వస్తోందంటే చాలు.. క్రైస్తవులు కేక్స్‌తో సిద్ధమైపోతారు. ఇంటికి వచ్చిన అతిథులకు కేక్స్ ఇచ్చి రుచి చూడమంటారు. ఈ నెలలో ప్రత్యేకత కలిగిన కేకుల రుచికి ఎవరైనా ఫిదా అయిపోవాల్సిందే. క్రిస్మస్ సందర్భంగా హోం మేడ్ కేక్స్‌లో మాది అందెవేసిన చెయ్యి అంటున్నారు కొంతమంది మహిళలు. ప్లమ్ కేక్స్‌తో పాటు పేస్ట్రీ, చాక్లెట్, కస్టమైజ్డ్ కేకులు అందంగా రూపొందిస్తున్నారు. కొంతమంది డిమాండ్ మేరకు విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. క్రిస్మస్ స్పెషల్ 12 కేక్స్ రుచిలో దేనికదే ప్రత్యేకంగా నిలుస్తాయి.

బేకరీల్లోనూ...

సిటీలోని పలు బేకరీల్లో ఈ వెరైటీ కేకులకు డిమాండ్ పెరుగుతోంది. దీంతో నగరంలోని ప్రసిద్ధ బేకరీలు కేక్ లవర్స్‌తో కిటకిటలాడుతున్నాయి.. చిన్న ప్లమ్‌కేక్ ధర రూ.15 నుంచి మొదలై...సైజ్‌ని బట్టి పెరుగుతోంది. ఆన్‌లైన్‌లో రూ.350 నుంచి క్రిస్మస్ స్పెషల్ కేక్స్ అందుబాటులో ఉన్నాయి. క్రిస్మస్ స్పెషల్ 12 కేక్స్ ఇవి...

‘బ్లాక్ ఫారెస్ట్ కేక్’తో శుభ స్వాగతం



ఈ కేక్‌ను క్రిస్మస్ నెల ప్రారంభంలో తయారుచేస్తారు. దీనిని క్రిస్మస్ ఒకటో కేక్ అంటారు. దీని తయారీని ప్రారంభిస్తే నెలంతా మధురంగా ఉంటుందనేది జర్మన్ల మాట.

ఇటాలియన్ క్రీమ్ కేక్

క్రిస్మస్ రెండో కేక్... ఇటాలియన్ క్రీమ్ కేక్. ఇది ఇటలీకి చెందింది. బ్లాక్ ఫారెస్ట్ కేక్ టేస్ట్ అనంతరం క్రైస్తవులు ఈ కేక్‌ను టేస్ట్ చేస్తారు.



హాలీడే కేక్... లేదా క్లాసిక్ వాల్డ్‌రోఫ్ రెడ్

ఇది క్రిస్మస్ మూడో కేక్. చూసేందుకు ఎరుపు, తెలుపు రంగుల్లో ఉండే ఈ కేక్ న్యూయార్క్‌లో ప్రసిద్ధి చెందింది. ఈ కేక్‌ని క్రిస్మస్ హాలిడే కేక్‌గా అక్కడ పిలుస్తుంటారు.



మామ్స్ రమ్ కేక్



ఇది క్రిస్మస్ నాలుగో కేక్. యునైటెడ్ స్టేట్స్‌లోని ‘తనాన’ సిటీలో కుమారుడికి కోసం ఓ తల్లి తయారుచేసింది. అప్పటి నుంచి ఈ దేశంలో ప్రసిద్ధి చెందింది.

ఫిగ్గీ పుడ్డింగ్



ఇది క్రిస్మస్ ఐదో కేక్.. ఇంగ్లాండ్‌లో ప్రసిద్ధిచెందిన కేక్. అక్కడ ఎక్కువగా పాఠశాలలకు వెళ్లే చిన్నారులకు తల్లులు లంచ్ బాక్స్‌లో పెడుతుంటారు.

డెలీషియస్ స్టిక్కీ టోఫీ పుడ్డింగ్



ఇది క్రిస్మస్ ఆరో కేక్. ఇది కూడా ఇంగ్లాండ్‌కు చెందిన కేక్. ఈ కేక్‌ని రష్యన్లు ఎక్కువగా ఇష్టపడుతుంటారు.

ప్యూర్‌వెజ్.. క్యారెట్ కేక్



ఇది క్రిస్మస్ ఏడో కేక్. యూరప్‌కు చెందిన ప్యూర్ వెజ్ కేక్. ఆ దేశంలో అంత ప్యూర్ వెజ్‌కేక్ మరొకటి లేదంటున్నారు ఆ దేశస్థులు.

మష్రూమ్స్ మేడ్... చాకొలెట్ కేక్



క్రిస్మస్ 8వ కేక్ ’చాకొలెట్‌డికేడెన్స్ యులే లోగ్ కేక్. ఇది యునైటెడ్ స్టేట్స్‌కు చెందింది. పుట్టగొడుగులతో తయారు చేసిన ఈ కేక్ చాలా ప్రసిద్ధి.

వైట్ చాకొలెట్ రాస్ప్బెర్రీ చీజ్ కేక్



ఇది క్రిస్మస్ 9వ కేక్. పూర్తిగా చీజ్‌తో తయారుచేసే ఈ కేక్ యునైటెడ్ స్టేట్స్‌లో విపరీతమైన ఆదరణకు నోచుకుంది.

ఫ్లోర్‌లెస్ చాకొలెట్ కేక్



ఇది క్రిస్మస్ 11వ ఇటాలియన్ కేక్. ఇక్కడ క్రిస్మస్ హాలిడే కేక్ అని కూడా పిలుస్తారు. దీని రుచి అమోఘం.

జింజర్ బ్రెడ్ కేక్



ఇది క్రిస్మస్ 10వ కేక్. ఇది యునైటెడ్ స్టేట్స్‌కు చెందినది. నాలుకకు అంటీ అంటనట్టు మంట, తియ్యగా ఉంటుంది దీని రుచి. ఈ కేక్‌కు అభిమానులు ఫిదా అయిపోతారు.

క్రిస్మస్ ఫ్రూట్ కేక్



ఇది క్రిస్మస్ 12వ కేక్. దీనిని క్రిస్మస్ పండుగ రోజున కెనడాకు చెందిన క్రైస్తవులు తయారు చేశారు. అప్పటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా ఈ కేక్‌ను తయారుచేసుకోవడం లేదా, బేకరీల్లో కొనుగోలు చేసి తెచ్చుకోవడం ఆనవాయితీ. క్రైస్తవులందరి ఇంటి క్రిస్మస్ రోజున ఈ కేక్ పక్కాగా ఉంటుంది.

స్టీల్‌ప్లాంటు ఉద్యోగులకు జీతాలు చెల్లించండి

పార్లమెంటులో కోరిన ఎంపీ శ్రీభరత్



విశాఖపట్నం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్ ప్లాంటు నష్టాల నుంచి కోలుకోవడానికి రూ.1,650 కోట్ల సాయం చేసి కేంద్రం ఉదారంగా వ్యవహరించిందని, ప్లాంటు మనుగడ కోసం కష్టపడి పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు జీతాలు సకాలంలో ఇవ్వాలని విశాఖ ఎంపీ శ్రీభరత్ సోమవారం పార్లమెంటులో కోరారు. ఈ అంశంపై గతంలో ఉక్కు మంత్రి కుమారస్వామిని కూడా కలిసి విన్నవించానని గుర్తుచేశారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రాం‘ఘన’ నియామకాలు

విశాఖపట్నం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని చదువుతున్న విద్యార్థులకు మెరుగైన వేతనాలతో ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. తాజాగా ఇంజనీరింగ్ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులకు అనేక సంస్థలు ప్రాంగణ ఎంపికలు నిర్వహించాయి. మొత్తం 1,120 మందికి గాను సుమారు 700 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. టీసీఎస్‌కు రూ.4 లక్షల నుంచి రూ. ఆరు లక్షల ప్యాకేజీతో 150 మంది, ఎల్అండ్‌టీ రూ.5 లక్షల వేతనాలతో 200 మంది ఎంపికయ్యారు. ఇన్ఫోసిస్ రూ.3.6 లక్షల నుంచి రూ.9 లక్షల వేతనాలతో 140 మంది ఎంపికయ్యారు. ఒరాకిల్, రేన్నీ మెటలిక్, మహేంద్రతోపాటు మరో పదికిపైగా కంపెనీలకు రూ.6 లక్షల చొప్పున ప్యాకేజీతో 250 మంది ఎంపికయ్యారు. వీరంతా వచ్చే ఏడాది విధుల్లో చేరనున్నారు. సైన్స్, ఆర్ట్స్, లా విద్యార్థులను కూడా అనేక సంస్థలు భారీ వేతనాలతో ఉద్యోగావకాశాలను కల్పిస్తున్నాయని అధికారులు వివరించారు.

పినగాడి - వేపగుంట రహదారి విస్తరణపై అభ్యంతరాలు

- వీఎంఆర్‌డీఏ ప్రజాదర్బార్‌కు తరలి వచ్చిన బాధితులు



వీఎంఆర్‌డీఏ చైర్మన్, కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న పినగాడి గ్రామస్థులు

విశాఖపట్నం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి మండలంలోని పినగాడి జంక్షన్ నుంచి వేపగుంట జంక్షన్ వరకు రహదారిని విస్తరించడానికి వీఎంఆర్‌డీఏ ప్రకటించిన అభివృద్ధి ప్రణాళికపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. భోగాపురం విమానాశ్రయం చేరుకోవడానికి కనెక్టివిటీ రహదారులను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ, ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్ కలిసి 15 రహదారులను విస్తరించాలని నిర్ణయించాయి. అందులో పినగాడి - వేపగుంట ఒకటి. ప్రస్తుతం ఈ రహదారి 60 అడుగుల వెడల్పున ఉండగా 150 అడుగులకు విస్తరించాలని తీర్మానం చేశారు. దీని పొడవు 7.25 కి.మీ. విస్తరణకు అయ్యే అంచనా వ్యయం రూ.36.25 కోట్లు. ఇది రహదారులు, భవనాల శాఖ ఆధీనంలో ఉంది. ఈ మార్గం అనకాపల్లి జిల్లాలోని 26 గ్రామాలను పినగాడికి కలుపుతుంది. అక్కడి నుంచి వేపగుంట రహదారి ద్వారా నగరంలోకి వస్తుంది. వీఎంఆర్‌డీ ప్రకటన ప్రకారం విస్తరిస్తే గృహాలు, దుకాణ సముదాయాలు తొలగించాలిది. తమకు రహదారి విస్తరణ కంటే నివాసాలు, వ్యాపారాలే ముఖ్యమంటూ పినగాడి, వేపగుంట ప్రాంతాల వాసులు పెద్దసంఖ్యలో సోమవారం వీఎంఆర్‌డీఏ కార్యాలయానికి వచ్చారు. చైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ విశ్వనాథన్ కిందికి వచ్చి వారితో మాట్లాడారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. పనులు చేపట్టడానికి కొంత సమయం పడుతుందని, తప్పనిసరి స్థితిలో భూమిని తీసుకోవాల్సి వస్తే నిజమైన బాధితులను సర్వే ద్వారా గుర్తించి, నష్టపరిహారం ఇప్పించేందుకు ప్రయత్నిస్తామన్నారు. కాగా సోమవారం నిర్వహించిన ప్రజాదర్బారుకు 15 అర్జీలు వచ్చాయి. ప్లానింగ్ విభాగాధిపతి వి.శిల్ప, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ హరిప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు కోసం 5,994 దరఖాస్తులు

విశాఖపట్నం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్లుగా నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను అధికారులు శరవేగంగా పరిశీలిస్తున్నారు. ముసాయిదా జాబితాను గత నెల 23న విడుదల చేశారు. ఆ రోజు నుంచి అభ్యంతరాలను స్వీకరించారు. అదే సమయంలో కొత్తగా ఓటరు నమోదుకు ఆన్‌లైన్‌లో 1,930, ఆఫ్‌లైన్‌లో 4,064 మొత్తం 5,994 దరఖాస్తులు వచ్చాయి. వీటి పరిశీలనకు ఆరు జిల్లాల్లో ప్రత్యేక బృందాలను నియమించారు. ఈనెల 30న తుది జాబితా విడుదల చేస్తారు.

ప్రజా సమస్యలపై 213 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, అధికారులు

మహారాణిపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 213 వినతులు అందాయని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. రెవెన్యూ విభాగానికి సంబంధించి 59, జీవీఎంసీ 64, పోలీసు 16, ఇతర శాఖలవి 74 అర్జీలున్నట్లు పేర్కొన్నారు. పది రోజుల్లో శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. జేసీ మయూర్ అశోక్, డీఆర్‌వో భవానీశంకర్, ఆర్‌డీవో శ్రీలేఖ, అడిషనల్ కమిషనర్ వర్మ, అధికారులు పాల్గొన్నారు.

ఎల్‌జీ పాలిమర్స్‌ను తెరిపించాలి

ఎల్‌జీ పాలిమర్స్‌ను తెరిచి ఉపాధి కల్పించాలని కాంట్రాక్ట్ వర్కర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించిన అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

పోలీస్ కమిషనరేట్‌కు 117 ఫిర్యాదులు

విశాఖపట్నం: నగర పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం 117 ఫిర్యాదులు అందాయి. సీపీ శంఖబ్రతబాగ్చి బాధితుల సమస్యలను ఆలకించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అత్యధికం కుటుంబకలహాలు, భూ వివాదాలు, భార్యాభర్తల గొడవలు, మోసానికిసంబంధించిన ఫిర్యాదులున్నాయి.

జీవీఎంసీలో 94 వినతులు

వెంకోజీపాలెం: జీవీఎంసీలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 94 వినతులు వచ్చాయని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. పాత సమావేశ మందిరంలో కమిషనర్ డాక్టర్ పి. సంపత్‌కుమార్‌తో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. సమస్యలను మూడు రోజుల్లో పరిష్కరించే విధంగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

అప్పన్న సన్నిధిలో ధనుర్మాసోత్సవాలకు శ్రీకారం




ఆలయంలో గంట మోగిస్తున్న సిబ్బంది

సింహాచలం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి)నెలగంట మోగించడంతో వరాహలక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో సోమవారం ధనుర్మాసోత్సవాలకు వైదికులు శ్రీకారం చుట్టారు. వేకువజామున నాలుగు గంటలకు స్వామి వారిని మేల్కొలిపారు. ప్రభాత ఆరాధనలు పూర్తిచేసి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయ దేవేరులు, గోదాదేవి, రామానుజాచార్యులు, మనవాళ్ల మహామునులు, తిరుమంగైఆళ్వార్, నమ్మాళ్వార్‌లను ఆస్థాన మండపంలో పుష్ప వేదికపై ఉంచారు. తిరుప్పావై తొలిపాశురాన్ని అనుసంధానం చేశారు. పగల్‌పత్తు ఉత్సవాల్లో భాగంగా తిరువీధి నిర్వహించారు. ధ్వజస్తంభం వద్ద ఉదయం 6.35 గంటలకు గంటా నాదం చేయడంతో నెలగంట పెట్టి, ధనుర్మాసోత్సవాలకు శ్రీకారం చుట్టారు. జనవరి 13న సాయంత్రం నిర్వహించే గోదా రంగనాథులకల్యాణంతో ధనుర్మాసోత్సవాలు ముగుస్తాయి. ఈ మాసంలో వేకువజామున ప్రత్యేక తిరువీధి ఉత్సవాలుంటాయని, దీంతో సుప్రభాత సేవ, ఆరాధన రద్దుచేస్తున్నట్టు ఈఓ ప్రకటించారు. ఏఈఓ ఎన్.ఆనందకుమార్, భక్తులు పాల్గొన్నారు.

రుషికొండలో తిరుప్పావై ప్రారంభం

సాగర్‌నగర్: శ్రీమహాలక్ష్మి గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కొలువైన రుషికొండ ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా తిరుప్పావై నిర్వహించనున్నామని ఏఈఓ జగన్మోహన్ ఆచార్యులు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 5 నుంచి 6 గంటల వరకు తిరుప్పావై కొనసాగుతుందన్నారు. సాయంత్రం 6 నుంచి 6.30 వరకు శుద్ధి, తోమాల, ధనుర్మాస ఆరాధన ఉంటాయన్నారు.



సంద్రం... పసిడి వర్ణ శోభితం!

ఉదయ భానుడి లేలేత కిరణ స్పర్శతో సంద్రం పసిడి వర్ణంతో శోభాయమానంగా సాక్షాత్కరించింది. అదే సమయంలో వేటకు వెళ్తున్న మత్స్యకారుల పడవ, ఎగురుతున్న పక్షులు ప్రకృతిదిద్దిన చిత్రంలా గోచరించాయి. ఆర్‌కే బీచ్ వద్ద సోమవారం ఉదయం ఆవిష్కృతమైన ఈ సుందర దృశ్యాన్ని వాకర్స్‌తో పాటు సందర్శకులు తిలకించి పులకించారు. ప్రకృతి రమణీయతకు నిలువుటద్దంగా నిలిచిన దృశ్యాన్ని ‘ఆంధ్రజ్యోతి’ కెమెరాలో బంధించింది.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

మాజీ ఎంపీ ఎంవీవీ ప్రాజెక్టులన్నింటిపైనా విచారణ జరపాలి

- జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావు



ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాన్ని చూపిస్తున్న పీలా, కార్పొరేటర్లు

విశాఖపట్నం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ గత ఐదేళ్లలో చేపట్టిన ప్రాజెక్టులన్నింటిపైనా జీవీఎంసీ అధికారులు ఉన్నతస్థాయి దర్యాప్తు జరపాలని టీడీపీ ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. జీవీఎంసీలోని తన చాంబర్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉండగా ఎంపీ హోదాను దుర్వినియోగం చేస్తూ ఎంవీవీ సత్యనారాయణ తన ప్రాజెక్టుల్లో భారీగా అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. జోన్-2 పరిధి మధురవాడ సర్వేనంబరు 2 లోని పట్టానంబరు 595లో అపార్టుమెంట్ నిర్మాణానికి అనుమతి కోసం జీవీఎంసీకి దరఖాస్తు చేసి, పూర్తిస్థాయిలో ప్లాన్ అప్రూవల్‌రాకముందే పట్టానంబరు 585లో భవన నిర్మాణం చేశారన్నారు. దీనిపై మహేష్ ఫిర్యాదుచేసినా చర్యలకు వెనుకడుగువేశారన్నారు. చివరకు హైకోర్టు ఆదేశిస్తేగానీ జీవీఎంసీ అధికారులు విచారణ జరపలేదన్నారు. కమిషనర్ పి.సంపత్‌కుమార్ విచారణలో ఎంవీవీ అపార్టుమెంట్ నిర్మాణం చేపడతామని చెప్పినచోట కాకుండా వేరొకచోట నిర్మించారని నిర్ధారణ కావడం ఎంవీవీ దందాకు అద్దం పడుతోందన్నారు. దీనితో పాటు హయగ్రీవ, సీబీసీఎన్‌సీ, కూర్మన్నపాలెం, కొమ్మాది తదితర ప్రాంతాల్లో ఎంవీవీ నిర్మించిన అపార్టుమెంట్లలో అనేక అవకతవకలు జరిగాయని, వీటిన్నిటింటిపైనా లోతైన విచారణ జరపాలని డిమాండ్ చేశారు. జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ మాట్లాడుతూ ఒకవైపు భవనాలకు ప్లాన్ రాకపోయినా, ఓసీ విడుదల కాకపోయినా, కోర్టుల్లో కేసులు కొనసాగుతున్నా ఎంవీవీ యథేచ్ఛగా నిర్మాణ పనులు కొనసాగిస్తూ, ఫ్లాట్ల విక్రయాలు జరుపుతున్నారన్నారు. దీని వల్ల ఫ్లాట్‌లు కొనుగోలు చేసినవారంతా మునిగిపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో టీడీ ఆర్ పేరుతో భారీ కుంభకోణం జరిగిందని, అందులో సింహభాగం టీడీఆర్‌లు ఎంవీవీ దక్కించుకున్నందున దీనిపై కూడా విజిలెన్స్ విచారణకు జీవీఎంసీ అధికారులు సిఫార్సు చేయాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గంధం శ్రీనివాసరావు, రాపర్తికన్నారావు, గొలగాని పోలారావు పాల్గొన్నారు.

క్రైం... crime news

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కంచరపాలెం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలం కావడంతో కంచరపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నా డు. వివరాల్లోకి వెళితే.. స్థానిక ఏఎస్ఆర్ నగర్‌లో నివాసం ఉంటున్న బన్నీ మోబీటెక్ సెల్ పాయింట్ నిర్వాహకుడు కె.బాలశేఖర్ (19) ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కి ఉరేసుకోవడంతో కుటుంబ సభ్యులు కంచరపాలెం పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ రవికుమార్ మృతదేహాన్ని స్వాధీనంచేసుకుని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.ఘటనాస్థలంలో దొరికిన ఉత్తరాన్ని బట్టి ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణమని పోలీసులు నిర్ధారిస్తున్నారు.

డార్మెటరీలో అగ్ని ప్రమాదం



మంటల్లో కాలిపోయిన పరుపులు

మహారాణిపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్ డౌన్ డార్మెటరీలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. డార్మెటరీలో పరుపులు, సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. కేజీహెచ్ డౌన్ పోలీసు విభాగానికి చెందిన షాపింగ్ కాంప్లెక్స్ సముదాయంలో సాయి మానసా డార్మెటరీ ఉంది. సోమవారం మధ్యాహ్నం విద్యుత్ షార్టు సర్క్యూట్ అయి ఏసీ వెనుక మంటలు వచ్చాయి. అప్పటికే డార్మెటరీలోని వారు నిర్వాహకులను అప్రమత్తం చేసి సామగ్రితో బయటకు వెళ్లిపోయారు. అగ్నిమాపక శాఖకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీవీలు సైతం కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

18న జిల్లాకు రానున్న ఎస్సీ వర్గీకరణ కమిషన్

విశాఖపట్నం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు షెడ్యూల్ ఉప కులాల వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ ఈనెల 18న (బుధవారం) జిల్లాలో పర్యటించనుంది. ఆరోజు ఉదయం 11 గంటలకు ఏకసభ్య కమిషన్ జిల్లాకు చేరుకుంటుంది. మధ్యాహ్నం రెండు గంటల వరకు వివిధ విభాగాల అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశమవుతారు. అనంతరం ప్రజలు, కుల సంఘాల ప్రతినిధుల నుంచి వినతులు స్వీకరిస్తారని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

నేటి నుంచి స్లినెక్స్-2024

విశాఖపట్నం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భారత్, శ్రీలంక నౌకాదళాలు విశాఖపట్నం కేంద్రంగా ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకూ నాలుగు రోజులు ద్వైపాక్షిక విన్యాసాలు నిర్వహించనున్నాయి. వీటిని ‘స్లినెక్స్-2024’గా వ్యవహరిస్తున్నారు. ఇవి రెండు దశల్లో జరగనున్నాయి. 17, 18 తేదీల్లో హార్బర్‌లో, 19, 20 తేదీల్లో సముద్రంలో విన్యాసాలు నిర్వహిస్తారు. రెండు దేశాల మధ్య సముద్ర సంబంధిత సహకారం కోసం 2005 నుంచి స్లినెక్స్ నిర్వహిస్తున్నారు. ఈసారి భారత్‌నౌకాదళం తరపున ఐఎన్ఎస్ సుమిత్ర, శ్రీలంక తరపున ఎస్ఎల్ఎన్ఎస్ సయూర పాల్గొంటున్నాయి.

న్యాయమూర్తులకు రాజీ, మధ్యవర్తిత్వంపై శిక్షణ



ఎంసీపీసీలో మాట్లాడుతున్న న్యాయమూర్తులు

విశాఖపట్నం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కోర్టుల్లో కేసుల సంఖ్య తగ్గించడానికి కక్షిదారులతో మధ్యవర్తిత్వం జరిపి, రాజీ కుదర్చడానికి సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన మీడియేషన్ అండ్ కన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ (ఎంసీపీసీ) సోమవారం నగరంలో 40 గంటల శిక్షణ ప్రారంభించింది. న్యూ కోర్టు కాంప్లెక్స్‌లో ప్రారంభమైన శిక్షణ 20వ తేదీ వరకు జరుగుతుంది. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు గోదావరి జిల్లాల న్యాయమూర్తులను ఆహ్వానించారు. నాలుగో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా, తూర్పు గోదావరి, రాజమహేంద్రవరం జిల్లాల సెషన్స్ జడ్జి గంధం సునీత, ఏపీ వాల్యూ యాడెడ్ టాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్మన్ జి.గోపి, న్యూఢిల్లీ నుంచి వచ్చిన ఎంసీపీసీ శిక్షకులు నగీనా జైన్, నీనా ఖరే, ఇతర న్యాయమూర్తులు పాల్గొన్నారు.